నమ్మలేని నిజాలు

దేశాల పైట్లు
ఇంధన అగచాట్లు
ధరల పోట్లు.
హోటల్ల మెను
అల్పాహారాల మోత
బండ వడ్డన.
నిప్పుల చూపు
అనల కాల జాణ
నీడల ఠాణా.
మంచు ఎడారి
అటకామ ఎడారి
జీవస్థావరం.
వెల్లు నీడలు
జీవఛాయ చిత్రాలు
బతుకు ఆల్బం.
- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

నాలా తెలంగాణలో
ఎవడు పుట్టలేదు !
నాకు లాగ మాటలెన్నొ
ఎవడు తిట్టలేదు !
సిద్ధాంతమొ రాద్ధాంతమొ
అంటాను అడాల్ఫ్ హిట్లర్ !
అడ్డమేనొ పొడుగేనో
నిలువునొ ఇంగ్లీష్ బట్లర్ !
- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245
శ్రీ నిజాలు



హైదరాబాద్ గురువారం 11-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:236 పేజీలు:6 వెల: రూ.1/-

# భారత్ ఫ్యూచర్ సిటీ కల సాకారం.. చరిత్రలో నిలిచే రోజు: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 10: భారత్ ఫ్యూచర్ సిటీ కల సాకారం.. చరిత్రలో నిలిచే రోజు అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం ప్రారంభంకానుంది. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ప్రపంచ స్థాయి నగర నిర్మాణానికి తొలి అడుగు పడనుందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయం ప్రారంభంకానున్నట్లు తెలిపారు.

కేవలం 6 నెలల్లోనే రికార్డు సమయంలో ఈఅఆం భవనం పూర్తైందన్నారు.

ఆధునిక భారత్‌కు నూతన నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ ఉండనుందని సీఎం తెలిపారు. ప్రపంచంలోనే గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రణాళిక, సాంకేతికత, సుస్థిర అభివృద్ధికి ప్రతీకగా ఫ్యూచర్ సిటీ మారబోతోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

ఈరోజు సాయంత్రం 5:30 గంటలకు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. రూ.20 కోట్లతో 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈఅఆం భవన నిర్మాణం జరిగింది. ప్రారంభానికి ముందే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి నెట్ జీరో భవనంగా ఈఅఆం గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

# ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్.. డ్రగ్స్ డాన్ నీతూబాయి పరారీ

హైదరాబాద్, జూన్ 10: హైదరాబాద్ ఐటీ కోర్ ఏరియాలో డ్రగ్స్ అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. నానక్‌రాంగూడలో డ్రగ్స్ డాన్ నీతూబాయిని పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ ఆపరేషన్ నిర్వహించింది.

ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారంతో డ్రగ్స్ డాన్ అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, నీతూబాయి కోసం నానక్‌రాంగూడలోనే ఈగల్ ఫోర్స్ మకాం వేసింది. ఐటీ కోర్ ఏరియాలో నీతూబాయి పెద్దఎత్తున గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు బయటపడింది.

నీతూబాయి ఇంటికి గంజాయి కొనుగోలు చేసేందుకు ఐటీ ఎంప్లాయిస్ క్యూ కట్టారు. గంట వ్యవధిలోనే 50 మంది ఐటీ ఉద్యోగులను ఈగల్ ఫోర్స్ పట్టుకుంది.

ధూల్‌పేట్ నుంచి వచ్చి ఐటీ కోర్ ఏరియాలో అడ్డాపెట్టిన నీతూబాయి.. కిరాణా షాపు మాటున గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ప్రతిరోజు ఐదు నుంచి పది లక్షల రూపాయల వరకు గంజాయి అమ్మకాలను కొనసాగిస్తున్నట్లు సమాచారం. గతంలోనే నీతూబాయిని అరెస్ట్ చేసిన అధికారులు.. పీడీ యాక్ట్ పెట్టారు. జైలు నుంచి బయటకు వచ్చిన నీతూ.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డ్రగ్స్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్‌గా తీవ్రంగా శ్రమిస్తోంది.

# అత్యధిక కాలం ప్రధానిగా మోదీ..

## ప్రశంసలు కురిపిస్తూ కేంద్ర క్యాబినెట్ తీర్మానం



న్యూ ఢిల్లీ, జూన్ 10:అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన బ్రేక్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ ఇవాళ ప్రత్యేకంగా సమావేశమైంది. అత్యధిక రోజులు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన మోదీని ప్రశంసిస్తూ కేంద్ర క్యాబినెట్ ఇవాళ తీర్మానం పాస్ చేసింది. క్యాబినెట్‌లో ఉన్న మంత్రులు అందరూ ఆ మీటింగ్‌లో పాల్గొన్నారు. మోదీపై ప్రశంసలు కురిపిస్తూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ ప్రకటన చేశారు. ఆ తర్వాత మంత్రులందరూ లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.

2014 మే 26వ తేదీన దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధానిగా పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లోనూ భారీ మెజారిటీతో ప్రధాని పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఆ ఏడాది మే 30వ తేదీన ఆయన మళ్లీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. ఇక మూడోసారి కూడా ప్రధానిగా 2024 జూన్ 9వ తేదీన మోదీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 4398 రోజుల పాటు బ్రేక్ లేకుండా ప్రధానిగా చేశారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ అధిగమించారు. నేటితో 4399 రోజుల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా మోదీ ఘనత సాధించారు.

# ఖర్గే సారథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం 11న

న్యూఢిల్లీ, జూన్ 10:కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.

మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బుధవారంనాడు కలిసి ఫిర్యాదు చేసింది. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యని ఆరోపించింది. దీనిపై న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మరోవైపు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా నిలబెట్టిన మహేశ్ కావత్ విజయంపై బీజేపీ ధీమాగా ఉంది.

# మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ కుట్ర: చామల కిరణ్ కుమార్

హైదరాబాద్, జూన్ 10: మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు. బీఎన్ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ.. ఎన్నికలను వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఈసీని అడ్డం పెట్టుకొని బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్నారు.మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లకు అవకాశం ఉందని.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెడుతోందని ప్రశ్నించారు. ముందు నుంచే మధ్య ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ చూసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయం గురించి దేశ ప్రజలకు తెలియాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ఎప్పటికీ అధికారంలోకి రారని చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# పీసా చట్టం.. ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం: మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 10: పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. ఈరోజు(బుధవారం) రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు.

### పేద వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ..

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు.

### పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదు..

గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ఆహ్వానం
కవిసంధ్య
తెలుగు శాఖ, డా. ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం
కవిసంధ్య – సాహిత్య సాంస్కృతిక సంస్థ, యానాం
సంయుక్త నిర్వహణ లో
కవిత్వ శిక్షణా శిబిరం
National Poetry Workshop
కవి సంధ్య 60వ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
13–14 జూన్ 2026, శనివారం, ఆదివారం
ఉదయం 9.30 గం॥లకు
డా.ఎల్.ఆర్.స్వామి ప్రాంగణం
డా.ఏటుకూరి ప్రసాద్ వేదిక
సెమినార్ హాలు, డా.ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం
డా.వరుగు భాస్కర్ రెడ్డి, సదస్సు సంచాలకులు, ప్రిన్సిపాల్, డా.ఎస్.ఆర్.కె.ఆర్ట్స్ కళాశాల, యానాం. 9440127967
డా.శిఖామణి, అధ్యక్షులు, కవి సంధ్య 9848202526
నాల్గవ సదస్సు
14.6.2026, ఆదివారం ఉదయం 10.00 నుండి 1.00 వరకు
డా.ఆర్.సీతారాం – అంశం : కవిత్వం – రచనా వ్యూహాలు
శ్రీ నామాడి శ్రీధర్ – అంశం : కవిత్వం – అపురూపత
డా.సుంకర గోపాల్ – అంశం : కవిత్వం – వస్తువు
సమన్వయ కర్త : డా.శిఖామణి
భోజనవిరామం : 1.30 నుండి 2.00 వరకు
అయిదవ సదస్సు
2.00 నుండి 4.00 వరకు
డా.ఎల్.కె. సుధాకర్ – అంశం : కవిత్వం – అనువాదం
శ్రీ దాట్ల దేవదానం రాజు – అంశం : కవిత్వం – అనుభవం
డా.శిఖామణి – అంశం : కవిత్వం : రచనా పద్ధతులు
సమన్వయ కర్త : శ్రీ అవధానుల మణిబాబు
4.00.గం.లకు
సమాపన సదస్సు
ముఖ్య అతిథి : శ్రీ దాట్ల దేవదానం రాజు
అధ్యక్షులు : డా.వరుగు భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్
సమాపన ప్రసంగం : డా.శిఖామణి
కవుల స్పందన - సర్టిఫికెట్స్ బహూకరణ
వందన సమర్పణ : డా. జె.చంద్రశేఖరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జువాలజీ

# మానవీయ కవి 'నందిని సిధారెడ్డి'



డా॥నందిని సిధారెడ్డిని సత్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఆచార్య హరగోపాల్, కె.శ్రీనివాస్. అల్లం నారాయణ తదితరులు.

హైదరాబాద్, జూన్ 10:గ్రామీణ జీవితాలను, తెలంగాణ మట్టి వాసనలను, మానవీయ విలువలను తన కవిత్వంలో ప్రతిబింబించిన అరుదైన కవి డా॥ నందిని సిధారెడ్డి అని వక్తలు కొనియాడారు. కవితా రచనతో పాటు ఉద్యమస్వభావం కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. నందిని సిధారెడ్డి ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం నారాయణ గూడలోని భారత్ ఇనిస్టిట్యూషన్స్‌లో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్, ప్రొ. రమామెల్కోటే, సీనియర్ జర్నలిస్టులు కె. శ్రీనివాస్, కె.రామచంద్రమూర్తి, దేవీప్రసాద్, అల్లం నారాయణ, మల్లేపల్లి లక్ష్మయ్య, మలుపు బాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

వారంతా నందిని సిధారెడ్డి కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని శ్లాఘిస్తూ ప్రసంగించారు. సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడాన్ని తెలంగాణ సమాజానికి దక్కిన గౌరవంగా ప్రస్తుతించారు. 'అనిమేష' ఉపద్రవగాథ కావ్యంలో ప్రకృతి స్వభావాన్ని గొప్పగా ఆవిష్కరించారంటూ వక్తలంతా ప్రశంసించారు.



ఈనెల 7న చిత్తూరులో ప్రముఖ రచయిత సి.ఎన్. చంద్రశేఖర్ రచించిన 'అంజలిదే.. గొనుమా!' కథా సంపుటి ఆవిష్కరణ మహోత్సవంలో ఎడమ నుండి కుడికి.. జిల్లేళ్ళ బాలాజీ, శ్రీమతి రాధిక (సి.ఎన్.చంద్రశేఖర్‌గారి సతీమణి), సి.ఎన్.చంద్రశేఖర్ (రచయిత), కట్టమంచి బాలకృష్ణారెడ్డి, యస్వీ. కృష్ణ, యం.ఆర్.అరుణకుమారి, ఆర్.సహదేవ నాయుడు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : అభిలాషా బిష్త్

నల్గొండ, జూన్ 10: భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ అన్నారు. బుధవారం భూదాన్ పోచంపలి మండలం దేశ్‌ముఖి గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన గ్రామ సభ నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. యువతకు హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సామూహికంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్ పాటించడం వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయడం హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం, మద్యనీ సేవించి వాహనం నడపరాదన్నారు. రహదారుల భద్రత అనేది ఒకరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యత మాత్రం అన్నారు. కుటుంబ సభ్యులు తమకోసం వేయికళ్లతో ఇంటి దగ్గర ఎదురు చూస్తున్నారని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

అధిక వేగంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాన నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని ఉంచారు. ఇంటికి కిటికీలకు ఎలా గ్రిక్స్ పెడుతున్నారో అదేవిధంగా తమ భద్రత కోసం హెల్మెట్ వాడాలని సూచించారు. దేశంలో సంవత్సరానికి 7, లక్షల మంది, తెలంగాణ రాష్ట్రంలో 7000 మంది, ప్రమాదాలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి తాళం ఫోన్ పౌచ్ , తలకు హెల్మెట్ కంపల్సరిగా పెట్టుకునే విధంగా చూడాలని అన్నారు. మందు తాగి వాహనదారుడు వాహనం నడపకూడదని, డ్రైవ్ లో అధిక మొత్తంలో కేసు నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు.

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతీ ఒక్క పౌరుడు బాధ్యతగా గుర్తించి ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత బాధపడటం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమన్నారు. యువత రోడ్డు భద్రత విషయంలో ఆదర్శంగా నిలిచి సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పురం చెరువు కట్ట వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు నివారించేందుకు భద్రతా చర్యలు చేపట్టేందుకు శాంక్షన్ చేసిన ఇంతవరకు చర్యలు చేపట్టలేదని, వాటి విషయమై సంబంధిత అధికారులతో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, మండల తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శశికళ, గ్రామ సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, ఉప సర్పంచ్ నూకల అశోక్, మండల వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి, చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి, ఎంపీఓ శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, పాల్గొన్నారు.

ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
సంయుక్త ఆధ్వర్యంలో
సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
79వ జయంతి సందర్భంగా
అధ్యక్షులు, తెలుగు రథం
శ్రీ కొంపెల్ల శర్మగారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం-బహూకరణ
తెలుగు సాహిత్యంలో హాస్యం
సోమవారం 15-6-2026, సా. 6 గంటలకు
శ్రీ త్యాగరాయగానసభ, హైదరాబాదు

## రాధశ్రీ రాగాలు

రణరంగమందు రథి
వ్రాతలందున శరథి
బుధుడు మన దాశరథి
అనును రాధశ్రీ !!
విమల గుణ సంయుతుడు
వేద విద్యా విదుడు
విశ్వనాథ కులుండు
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 11-6-2026



పోతుగంటి వీరాచారి రచించిన **"మట్టి పరిమళం"** పుస్తకానికి **డా॥ నాళేశ్వరం శంకరం** రాసిన ముందుమాట.

# మట్టి పరిమళం వస్తు సుగంధం వీరాచారి కవిత్వం

పోతుగంటి వీరాచారికి కవిత్వం రాయాలన్న ఆకాంక్ష ఎప్పుడు మొదలైందో తొలిసారి రాసిన కవిత ఏదో నాకు తెలియదు కానీ ఉత్తమ ఆదర్శాలతోనే ప్రారంభమయ్యాడని ఈ **"మట్టి పరిమళం"** కవితా సంపుటి చదివిన తర్వాత తెలిసింది.వీరాచారి ఒక సామాజిక కవి , ప్రగతిశీల కవి, అభ్యుదయ కవి, మానవీయ కవి. స్వంత నివాసంతో మొదలై తన ప్రాంతం దాకా, ఆపైన దేశందాక ఆలోచించే ఆయన కవితా స్వభావం ఆరోగ్యదాయకమైంది. వీరాచారికి ప్రజల్ని చైతన్యవంతం చెయ్యడమే తన కవిత్వ కర్తవ్యంగా ఉన్న కవి.కర్షకులు, శ్రామికుల పక్షాన రాస్తున్న ఈ కవిని అభినందించకుండా ఉండలేము.

పరిమళం అనగానే మట్టి పరిమళమే ముందుగా జ్ఞాపకం వస్తుంది. అందునా సారవంతమైన నేల దాన్ని సాగుచేసే రైతులు ముందుగా జ్ఞాపకానికి వస్తారు. తొలకరి వానతో వచ్చే మట్టి పరిమళానికి మించిన సుగంధం మరొకటి లేదు. రైతు ఆ పరిమళంలోనే జీవనాన్ని సాగిస్తాడు. రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక్క అంటున్నారు కాని, ఆ రైతే నేడు అనుభవిస్తున్న దుఃఖంలో భాగం పంచుకునే వారేనని కవి ఆవేదన చెందుతూ రైతుకు భరోసా ఇద్దాం, అన్నదాతకు అండగా నిలవాలి, మట్టి పరిమళంలో రైతు వంటి కవితలు చదివితే రైతు పట్ల కవి ఎంత భాధ్యతగా ఉన్నాడో అర్ధమవుతుంది.సకల జనుల ఆశాజ్యోతులు రైతులే. అయినా వారు పండించిన ధన్యానికి గిట్టుబాటు ధరనైనా పాలకులు ఇవ్వలేకపోవడం వల్ల , వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.ప్రజలే భరోసా ఇవ్వాలి లేకపోతే చేరువలో సంక్షోభం తప్పదు. అన్నదాతనే

**కాదు అన్నం తినే ప్రతీ ఒక్కరినీ**
**వేధించగలదన్న హెచ్చరికను కవిత ద్వారా చేసారు.**

**నాగలి నవ్వుతూ...**
**మట్టి పరిమళం చూడాలని**
**ఏరువాక వైపు ఆశగా ఎదురుచూస్తాడు...**

సంతోషంతో ఆకాశం చైతన్యవంతమైన వర్షం అందిస్తున్నా రైతు దుఃఖంలో నుంచి బయటపడడం లేదు.అగ్రికల్చర్ ఉంటేనే కదా మన కల్చర్ బతికేది. మట్టిపరిమళం రైతు ఇంట సుభిక్షంగా ఉండాలంటే ప్రజలు ముందుగా రైతుకు భరోసా ఇవ్వాలి

తెగ బలిసిన కార్పొరేట్ సంస్థలకు రైతన్నల కష్టార్జితాన్ని కట్టబెట్టేది నిలిచిపోవాలంటే రైతులకు అండగా ప్రజలుండాలి. ప్రకృతి కోపానికి, పాలకుల స్వార్ధానికి మధ్యన నలిగిపోతున్న రైతుల పక్షాన నిలబడి వీరాచారి మంచి కవితలు రాశారు...

నేనిప్పుడు కవిని అన్న కవిత ఆయన జీవితాన్నీ, తనదైన కవిత్వ వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించిన కవితలు.వీటి ద్వారా ఆయన దృష్టి దృక్పథం వ్యక్తమైంది. కరోనా కాలంలో ఉదయించిన కవిని అని చెప్పుకున్నారు. విశ్వకర్మల ముద్దు బిడ్డను అన్నారు. కుల వృత్తిని నమ్ముకున్న వంశంలో నుంచి కవిగా జన్మించారు. అమ్మ కడుపు నుంచి ఏడుస్తూ జన్మించినా భవిభారత్ పౌరునిగా పరిచయం చేసుకున్నారు."కవిత్వం" కవితలో కళాత్మక దృష్టి నా కవిత్వమని విన్నవించు కున్నాడు. వీరాచారి ప్రకృతి ఆరాధకులు. ప్రకృతిని ప్రేమిండమంటే కాలుష్యం నుండి ప్రకృతిని రక్షించుకుంటే మంచిది.అందుకు వృక్షసంతతిని కాపాడుకోవాలి. ప్రకృతిని ప్రేమించడం నేర్చుకోవాలని హితబోధ చేస్తారు.

వీరాచారి గృహజీవన మమకారాన్ని కాపాడుకునే మంచి కవితలు రాశారు. కుటుంబమే మనిషికి స్వర్గసీమ.అందులో మమేకమై కొన్ని కవితలు రాశారు. అనురాగమూర్తి అమ్మ, నాన్న గుడిలోని దేవుడు, నాన్నకు ప్రేమతో, అమ్మా - నాన్నలే ప్రత్యక్ష దైవ స్వరూపులు, బతికుండగానే నరకం, ఆలుమగల జీవితం, ఉమ్మడి కుటుంబమే ఉదయించే కిరణం, బంధాలు బహుబంధాలు అంటూ ఎనిమిది కవితలు రాశారు.

ప్రతీ కవిత విలువైనదే. కుటుంబ పవిత్రతను తెలియజేప్పేదే. అమ్మ ప్రాధాన్యతను వర్ణించి చూపారు.అమ్మే బిడ్డకు తొలి గురువు.బిడ్డ కోసం తన ఆకలిని చిరునవ్వుతో కప్పేస్తుంది.ఇక నాన్నంటే భాధ్యత , మార్గదర్శి. రాజీలేని పోరాటం వైపు నడిపించే దిక్సూచి.నాన్న కురిసే వానలాంటి వారు. గర్జించే మేఘంవంటి వారు.అయితే పిల్లలు పెరిగి పెద్దవారై ఆ తల్లీదండ్రులకు బ్రతికుండగానే నరకం చూపిస్తున్న వైనాన్ని సైతం ఆర్ధంగా ఆవేదనతో బలంగా రాశారు.ప్రస్తుత కుటుంబ బంధాలు, ప్రేమ బంధాల నుంచి విడిపోయి ఆధిపత్య బంధాలుగా మారుతున్నాయి.అందువల్ల కుటుంబానికి నైతిక విలువలు అవసరమని వీరాచారి చెప్పిన తీరు బాగుంది.

వీరాచారి కవిత్వంలో గుణం పుట్టిననేల పౌరుషాన్ని వ్యక్తీకరించడం.అన్యాయాన్ని ధిక్కరించడంలో ,ఉద్యమించడంలో నల్లగొండ జిల్లా ముందుంటూ వచ్చింది.చుట్టుముట్టు సూర్యాపేట నట్టనడుమ నల్లగొండ.నల్లగొండ ఖిలా కింద నీ గోరి కడతాం కొడుకో నిజాం

**"పరిమళం అనగానే మట్టి పరిమళమే ముందుగా జ్ఞాపకం వస్తుంది. అందునా సారవంతమైన నేల దాన్ని సాగుచేసే రైతులు ముందుగా జ్ఞాపకానికి వస్తారు. తొలకరి వానతో వచ్చే మట్టి పరిమళానికి మించిన సుగంధం మరొకటి లేదు. రైతు ఆ పరిమళంలోనే జీవనాన్ని సాగిస్తాడు"**

సర్కారోడా అని శాసించిన జిల్లా వ్యక్తి వీరాచారి. జానుపాడు , సెదులు దుర్గా, నీలగిరి,యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు కృష్ణమ్మ గలగలను, పోచంపల్లి చేనేత పరిశ్రమను కొనియాడిన తీరు మెచ్చుకోదగినది. ఈ ఉద్యమాల జిల్లా నల్లగొండ కవితలో భూదానోద్యమానికి నాంది పలికిన జిల్లా




**ప్రతులకు:** పోతుగంటి వీరాచారి
సెల్:9666693494

నల్లగొండనే అంటారు. మల్లు స్వరాజ్యం, ధర్మ భిక్షం, బండి యాదగిరి ఘనకీర్తిని జ్ఞాపకానికి తేవడం ఔచిత్యంగా ఉంది. నల్లగొండ వైభవానికి ముగ్గుపోసిన కవిత.

అలాగే తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో "నవ్య తెలంగాణ" కవిత వీరాచారి వస్తు విశృతికి అద్దం పట్టే కవిత.భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన తీరును విశ్లేషించారు.భూస్వాముల ఆధిపత్య దురాగతాలను , నిజాం నిరాంకుశత్వాన్ని, రాజకార్య దౌర్జన్యాన్ని ఎండగట్టారు.ఉద్యమ కాలంలో శ్రీకాంతాచారి బలిదానంతో పాటు దాశరధి, కాళోజీ, జయశంకర్ సార్ ను ఈ. కవితలో నిలువెత్తు నిలిపారు.

వీరాచారికి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పాటు దేశభక్తిని నిలువెత్తు నిలిపిన కవిత కార్గిల్ యుద్ధం.పాకిస్తాన్ సైన్యం ఉగ్రవాద ముసుగులో వచ్చినప్పుడు నాయక్ గోపయ్య చారి ఆపరేషన్ కు శ్రీకారం చుట్టిన తీరు ప్రశంసించారు. వీరజవానులకు నివాళులు అర్పించారు. ఐదేళ్ళకు ఒకసారి పాలకులు వస్తారు పోతారు, దేశాన్ని రక్షించుకునేది ప్రజలే అంటారు.

వీరాచారి ఉగాది మీద రెండు కవితలు, సంక్రాంతి మీద మరో రెండు కవితలు రాశారు. వీటితో పాటు బోనాల పండుగను ఒక కవితగా రాశారు.మన సంస్కృతిని, మన నమ్మకాలను , విశ్వాసాలను పండుగలు పరిరక్షిస్తాయి.పట్టణ సంస్కృతికన్నా ఈ గ్రామీణ పండుగలు ప్రజల జీవన అస్తిత్వం, ఆచార వ్యవహారాలను , పరిరక్షిస్తున్నాయన్న భావనను ఈ పండుగ కవితలలో రాశారు.

ఇక ఈ కవితా సంపుటిలో అత్యధిక కవితలు ఎలిజీలే. మట్టి పరిమళం లోనే ప్రతి కవితలు ఒకటి కాదు రెండు కాదు మప్పరెండు కవితలు ఉన్నాయి. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన గాంధీ గారిపై రెండు కవితలు ఉన్నాయి.

భగత్ సింగ్ మొదలుకొని అంబేద్కర్ దాకా వివేకానందుడు మొదలుకొని అబ్దుల్ కలాం దాకా నందమూరి తారక రామారావు మొదలుకొని వెంకయ్యానాయుడు దాకా వారి వారి వ్యక్తిత్వాలను ప్రత్యేకతలను చదువుతుంటే ఒక్కొక్కరి ప్రొఫైల్ కళ్ళ ముందు కదలాడుతుంది. తెలంగాణ కొస్తే కొండా లక్ష్మణ్ బాపూజీ,కొత్తపెల్లి జయశంకర్, పీవీ నరసింహారావు లను స్మరించారు. ఒక్కొక్కరి జయంతి వర్ధంతిలను పురస్కరించుకొని జ్ఞాపకం చేసుకున్న తీరు బాగుంది. అలాగే తెలుగు సాహిత్య వైతాళికులను తన జ్ఞాపకాలలో నిలుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు, పిల్లలమర్రి పిన వీరభద్రుడు, కపిలవాయి లింగమూర్తి,సినారె, కాళోజి తోపాటు సినిమా వారైనా సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల, బాలసుబ్రమణ్యం లను స్మరించారు.ప్రతి కవిత జ్ఞాపకాల ప్రొఫైల్ గానే చెప్పాలని గాంధీ గారిని మరో మారు జన్మించమంటారు అహింస ఎక్కడో లేదు ప్రతి హింస లేదు మిగిలింది. అహింసలో ప్రజలు నలిగిపోతున్నారన్న భావన మనల్ని చైతన్య పరుస్తుంది. భగత్ సింగ్ మండే సూర్యుడు ఆయన విప్లవాత్మక విప్లవాత్మక విప్లవాత్మ కు ప్రణమిల్లక తప్పదు వివేకనందుడు మన దేశ సంస్కృతికి ప్రతీక అలాగే తెలంగాణ జాతిపితలను సాహిత్య పెద్దల మీద రాసిన కవితలు నేటి విద్యార్థి లోకానికి వారి వారి స్మృతులు చెప్పే విధంగా ఉన్నాయి. భానుపురి కవిరాజ్, దూదపాక శ్రీధర్, వనజీవి రామయ్య తెలుగు సాహిత్య పాఠకులకు కొత్తగా పరిచయం చేశారు. వారి వారి జీవన స్మృతులను వీరాచారి తలపోసిన తీరు చూస్తే వారి వారి ఆత్మకథలు చదవాలనిపించింది. ఉద్యమాల్లో అమరు లైన వారిని స్మరించిన తీరు చాలా స్ఫూర్తిని నింపుతుంది. వీరాచారి వారి హృదయాలతో బాధాత్వం చెంది స్మరించారు. అందులో బుల్లోజు అయోధ్య కామ్రేడ్ మారోజు వీరన్న మూగబోయిన ప్రజల గొంతుక లను స్మరించిన తీరును తప్పక శ్లోకించవలసిందే అస్తిత్వ పోరాటాల రూపశిల్పి మా రోజు వీరన్న పోరాటాల రూపశిల్పిగా స్మరించడం ఎంతో బాగుంది. వీరాచారి సంగీత ప్రియుడు పాటను ఆస్వాదించే హృదయ మున్నవాడు. కవులు నాయకుల చైతన్యాన్ని పరిపూర్ణంగా తనలో నింపుకున్నవాడు. వీరితో పాటు మన సమాజంమారడానికి తొలిసారిగా దళిత చైతన్యాన్ని అక్షర జ్ఞానాన్ని నింపిన సావిత్రిబాయిని పూలేను స్మరించిన ఆ వెలుగు దివ్వెలు సమాజాన్ని మేల్కొల్పిన వారిగా వారిని పాతకాలంలో తప్పక స్మరించుకోవాలి. ఇవన్నీ మంచి ఎలిజి కవితలే. మట్టి పరిమళంలో మరో పరిమళం స్త్రీ స్వేచ్ఛ కోసం స్త్రీలను సమస్యలు ఆస్వాదించి వారి స్వేచ్ఛ కోసం చైతన్యం కోసం పరితపించి రాసినవి. దాదాపు ఐదు కవితలు ఇందులో ఉన్నాయి. ఆమె పుట్టింటి ప్రాణదీపం, ఇంకెన్నాళ్లు మహిళా ఈ ఘోరాలు,ఓ మహిళా నీకు వందనం, వితంతువు ఒంటరి మహిళ కవితలపై ప్రత్యేక వ్యాసం రాయాలన్న ఆకాంక్ష వీటిని చదివిన వారికి కలుగుతుంది కూడా. తల్లిదండ్రులు దూరమై అత్తామామలకు భారమై అన్నద మ్ముల అనురాగం కరువై భవిష్యత్తు ఆగమై బతుకుతున్న స్త్రీలను వితంతు స్త్రీలను వారి బాధలు విని తానునుభవించి రాసినట్లే ఉంది.

**ఒంటరి పోరాటం**
**బతుకు కోసం ఆరాటం**
**పనుల కోసం వెంపర్లాట**
**పూట గడవక తండ్లాట**

వితంతు మీద ఇంత చక్కాగా రాశాడు. ఈ సరళతలో స్పష్టత ఉంది, సూటిదనం ఉంది, ఆవేదన ఉంది.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్మరించిన కవితల్లో మానవ సమాజంలో మగవానికి మహిళా లేక పోతే గెలుపు లేదు. ఆమె లేకపోతే మగవాడు హీరో కాదు జీరో అంటాడు. ఆడపిల్లంటే పుట్టింటి ప్రాణదీపం, మెట్టింటి మణిదీపం అమ్మ కడుపులో పుట్టిన మరో అమ్మ ఆడపిల్ల ,ఆడపిల్ల వద్దంటే అమ్మలేని అనాధ అవుతుంది. సమాజం ఆకాశమంత ఓర్పు భూదేవి అంత నేర్పు ఉన్న మహిళ పురుష పురుషాది పత్య కోరల కింద నలిగిపోతుందని భావిస్తాడు. ఈ మధ్యనే దేశంలో సంచలనం సృష్టించిన మణిపూర్ సందర్భాన్ని ఉటంకించారు. మనవాదుల రాజ్యంలో మణిపూర్ రాష్ట్రంలో నగ్నంగా ఆడపిల్లను నడి వీధుల్లో ఊరేగిస్తుంటే కళ్ళున్నా చూడలేని దృతరాష్ట్ర దుశ్చర్యం ఇదని ఆదివాసి యువతలే లక్ష్యంగా పైశాచిక ప్రవర్తిస్తున్నా నేడు ప్రజాస్వామ్యం బ్రతికే ఉందా అని ఆవేశతోను ఆవేదనతోను ప్రశ్నిస్తాడు. నేడు ముందుగా స్త్రీ జాతిని మేల్కొనాలని రాని రుద్రమ దేవిలా వీరనారి చాకలి ఐలమ్మ తనకు తాను రక్షించుకోవడానికి ముందుకు రావాలని వివస్త అయ్యింది ఆ ఒక్క స్త్రీనే కాదు దేశమే వివస్త అయిందన్న భావన భారతీయులు కలగాలని విన్నవిస్తాడు పోతుగంటి వీరాచారికి భాషాభిమానంతో పాటు శ్రీ శ్రీ పైన అభిమానం ఉంది దీనికి తోడు శ్రీశ్రీ కళా వేదికపై మరింత అభిమానం ఉంది.

శ్రీశ్రీని స్మరిస్తూ తెలుగు కవిత్వానికి దిక్సూచి అతడు అంటూ మంచి స్మృతి కవిత రాశాడు. ఆ నిత్య విప్లవ చైతన్య ఖడ్గ వారధిగా ఉన్న శ్రీ శ్రీ కళావేదిక సారథి కత్తిమండ ప్రతాప్ పై ఏకంగా ఓ కవితను రాశాడు. శ్రీ శ్రీ మీద ప్రేమను తనలో భావాన్ని రగిలించి ప్రతాప్ పైన ఆయన విస్తరింపజేస్తున్న భావాన్ని దృష్టిలో ఉంచుకొని సంస్థను జ్ఞాపకంగా ఉంచుకునే విధంగా అభినందిస్తూ రాసిన కవిత శ్రీ శ్రీ కళా వేదికకు ఒక ఆకృతిని ఇచ్చింది.

వీరాచారి మట్టి పరిమళంలో ఒక రైతన్నే కాదు శ్రామికుల్ని స్త్రీలను ఎలుగత్తి చాటాడు. కవితలో వస్తు విస్తృతికి కొదవలేదు. **శ్రీ శ్రీ అన్నట్లు అరవవాడి దోసై తోచిందేల్లారాస్తే అన్నట్లు** రాయగల్ల నైపుణ్యం కూడా వీరాచారిలో ఉంది.ఆయనకు ఇంకా అబ్బాల్సింది కవిత్వ నిర్మాణ శైలే. నిర్మాణంలో గాఢతను రోజుకింత స్వనీతం చేసుకుంటే మంచి కవి కాగలడు. అందుకు తగిన కృషి నిరంతరం చేయాలని భావిస్తున్నాను.



**–డాక్టర్ నాళేశ్వరం శంకరం**
తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు
9440451960

# చాతుర్వర్ణాలవారిని అలరించే చతురోక్తులు

పుస్తక సమీక్ష

ఉపాధ్యాయులు, నాయకులు, నటులు శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, సామాన్య గృహిణి, పనిమనిషి-వీరందరిలోనూ ఒక అంతఃస్సూత్రం ఉంటుంది. అదే హాస్యం, చతురత, అందరూ హాస్య రసాన్ని ఇష్టపడుతారు. అందుకే వీరు అందరూ, తమ సంభాషణలో కొంత హాస్యం జోడించి జవాబులు ఇస్తుంటారు. జవాబు విన్న ఎదుటి వ్యక్తి దృష్టిలో జవాబిచ్చిన వ్యక్తిపై గౌరవం పెరుగుతుంది. ఆయనను మరింతగా అభిమానిస్తాడు. హాస్య పూరితమైన జవాబులు సంభాషణల్లోని సీరియస్‌నెస్ తగ్గించి, ఇద్దరి మధ్య సుహృత్ వాతావరణాన్ని సృష్టిస్తుంది. వారు మరింత దగ్గరవుతారు. అలా జవాబివ్వటం చతురత అనీ, జవాబుల్ని చతురోక్తులు అని అంటారు.

చతురోక్తులు సతత హరితాలు. కాలం ధాటికి కొట్టుకుపోకుండా, నాలుగు కాలాలపాటు నిలబడి ఉంటాయి.

గాంధీగారి హాస్య పూరితమైన జవాబునో అబ్రహాంలింకన్ గారి చతుర సంభాషణో విన్న ప్రతిసారీ, హృదయం తేలికపడుతుంది. ప్రసిద్ధ కథకులు, యోగాధ్యాపకులు, సంభాషణా చతురులు, స్నేహానికి గొప్ప విలువ ఇస్తూ, ఉద్యోగరిత్యా పలు ప్రదేశాలు తిరుగుతూ, పలువురు వ్యక్తులను కలిసిన రచయిత కూతురు రాంరెడ్డి బహు చతురులు. ఏది చెబితే నాలుగు కాలాల పాటు, కాదు. కాదు నాలుగు తరాల పాటు సాహితీ చరిత్రలో నిలిచి పోగలరో, వారికి తెలుసు. పత్రికా రంగంలో అపూర్వ ప్రయోగశీలి ఈనాడు వాణిజ్య సంస్థల వ్యవస్థాపకులు స్వర్గీయ రామోజీరావుగారి అభిమాని. వారి విపుల చతుర తెలుగు వెలుగు లాంటి పత్రికల వీరాభిమాని. మంచి విషయాలు మరుగున పడకూడదు. తరువాతి తరానికి అందించాలి అన్న సదుద్దేశం వీరిది. చతుర పత్రికలో ప్రచురితమైన చతురోక్తులు చమత్కారాలు భద్రపరిచేవారు. వాటి లోంచి రసగుళికల్లాంటి వాటిని ఏరి ఇపుడు **"చతుర చతు రోక్తులు"** పుస్తకంగా ముద్రించి మనకు అందిస్తున్నారు.

పుస్తకం తెరవగానే, కృష్ణ గీత అన్న పేరుతో ద్వాపరయుగం నాటి శ్రీ కృష్ణుని లీలా విశేషాలు, భగవద్గీతలోని కొన్ని మణి మాణిక్యాల్లాంటి శ్లోకాలను ఉటంకించారు. **'అక్షర ధార'** అన్న శీర్షికతో వేల యేళ్ళ క్రితం మన ప్రాచీనులు ఋషులు ప్రవచించిన నిత్య సత్యాలు కొన్ని పేర్కొన్నారు. నాటి చాటువులు- నల్లుల బాధ పడలేక శివుడు మంచు కొండమీద నివసించాడనీ, విష్ణువు పాల సంద్రంపై పరవశించాడని చెప్పిన చాటువుతో ముందుకు సాగి, రాజా స్థానాల్లో చమత్కారాలు, పైకి కనిపించని, అనిపించని ఎత్తి పొడుపులుతో సాగి, ఆహార విశేషాలు (వడ, ఆవడ పకోడి బూంది వగైరా)పై షడ్రసోపేత పేరడీతో గారడి చేసారు. తన వైభవాన్ని, దైన్యాన్నీ సమంగా చెప్పుకోగలిగిన శ్రీనాథ కవి చాటువు-చింత చిగురు బచ్చలికూర తినలేక శ్రీకృష్ణునే 'ఛాలెంజి' చేసిన వైనం వివరించాడు రచయిత.

కూతురు రాంరెడ్డిగారు ఉటంకించిన చతురోక్తులలో పరిచయం చేయబడిన ప్రపంచ ప్రముఖ వ్యక్తులు కనీసం వంద మంది దాకానైనా ఉంటారు. వారిలో ప్రముఖులు. గాంధీజీ పి.వి.నరసింహారావు రామకృష్ణ పరమహంస, చలం, కందుకూరి వీరేశ లింగం, శ్రీశ్రీ, విశ్వనాధ సత్యనారాయణ, బాపు, సర్వేపల్లి రాధాక్రిష్ణన్, కృష్ణశాస్త్రి దేవులపల్లి, మాడపాటి హనుమంతరావు, గోరా శాస్త్రి, ఆర్.కె. లక్ష్మణ్, వివేకానందులు, మట్నూరి కృష్ణారావు, సంజీవదేవ్ గాలిబ్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రీ ప్రభృతులు. విదేశాల ప్రముఖుల చతురోక్తులు. బెర్నాడ్ షా, చీర్లీ చాప్లిన్, మార్గరెట్ థాచర్, ప్రపంచాధినేత అలెక్జాండర్ , అబ్రహాం లింకన్, ఐన్‌స్టన్ ప్రభుతులు పేర్కొన్న ప్రతి చతురోక్తికి తనదైన వ్యాఖ్యానం, ప్రముఖుడైన ఆ వ్యక్తి గురించో లేదా సందర్భం గురించో ఇచ్చి రాంరెడ్డిగారు తన పుస్తకం విలువపెంచారు.

ప్రమాదాలు, మరణాలు, ఆత్మహత్యలు, మానభంగాలు, హత్యలు, సైబర్ మోసాలు, లూటీలు, ధహనాలు, రాజకీయ కక్షలు కార్పణ్యాల మధ్య సామాన్య మానవుడు శిథిలమౌతున్నాడు. అతని మానసిక స్థితి పతనమౌతున్నది. వీటికి తోడు పర్యావరణం లోచోటు చేసుకుంటున్న మార్పులు ప్రకృతి వైపరిత్యాలతో మనిషి మనసు రోజూ, అతలా కుతలం అవుతున్నది. వీటన్నింటి మధ్య చిరునవ్వు. 'తేలికపాటి మందహాసం మానవ జీవితంలో కరువవుతున్నది. ఇలాంటి వివత్కర సమయాన మనకు అంతో ఇంతో చిరునవ్వు ప్రసాదించి మనసును తేలిక పరుచగలిగేవి ఇలాంటి రచనలే!

సుమారు 300 చతురోక్తుల్ని ఓపికగా సమకూర్చి పుస్తక రూపమిచ్చి అందిస్తున్న రచయిత కూతురు రాంరెడ్డికి అభినందనలు. ప్రతి తెలుగింట ఇలాంటి పుస్తకాలు అందుబాట్లో ఉండాలి, ఏమీ తోచనపుడో మనసు బగోలేనప్పుడో పుస్తకం తెరిచి ఓపికమేరా, 4,5 పేజీలు చదవాలి. ఎక్కడ మొదలు పెట్టి ఎక్కడ విరామం ఇవ్వాలి అన్నది మీ ఇష్టం. ఎక్కడైనా మొదలు పెట్టొచ్చు. ఎక్కడైనా ఆపేయ్యచ్చు. తెలుగు వాడికి హాస్య ప్రియత్వం తక్కువ అన్న అపప్రధమ తొలిగించేందుకైనా ఇలాంటి పుస్తకాలు కొనాలి. కొని అప్పుడప్పుడు కొన్ని పేజీల మేర చదవాలి. చాతుర్వర్ణాల వారిని అంటే విద్యా ర్థులు ఉద్యోగులు నిరుద్యో గులు, రీటయిరీస్‌లను అలరించే సంకలనం ఇది.




**ప్రతులకు:**
కూతురు రాంరెడ్డి
ప్లాట్ నెం.11, ఇ.నెం.6-67
సుప్రభాత్ వెంచర్-11, కాచవాని
సుంగారం, పి.ఎ. ఘట్‌కేసర్ (మం)
మెడ్చల్ జిల్లా-హైదరాబాద్-500
088. సెల్: 90004 15353
8897626171



**– కూర చిదంబరం**
సెల్: 8639338675




# పిల్లలకూ ఓటు హక్కు ఇవ్వండి



-పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ఈ మధ్య రాజకీయాల్లో జరుగుతున్న రకరకాల విన్యాసాలు చూశాం నేనూ, విదూ, అన్యలు. ఏకకాలంలో అయిదారు డెయిలీ సీరియల్స్, ఆరేడు భాషల్లోని రకరకాల సినిమాలు చూసినట్లు అనిపించింది. అబ్బబ్బ ఎన్ని ట్విస్టులు. ఎంత చర్చ. ఎంత విజ్ఞానం దేశ ప్రజలకు అందించారో చెప్పటానికి లేదు.

ఇవన్నీ చూస్తున్నప్పుడు అన్య, విదూ ముఖాల్లో ఏదో కనిపించింది. అది కోపమా, అనుమానమా, అసహాయతా, ఇవన్నీ కలిసినవా. మరేదైనానా అని నాకు ధర్మసందేహమో, అధర్మ తిక్కనో కలిగాయి. అప్పుడు అడిగాను.

"మీరిలా ఫేస్‌లు పెడితే నాకు అర్థం కాదు. సైలెన్స్ ఓ ఆయుధం అంటారు. అది శత్రువుల మీద ప్రయోగించాలి. స్వజనుల మీద కాదు. అయినా ఆడవారి నోటిలో మాట దాగదు అంటారు. నువ్వేంటి అన్యా? నీకు మౌనం నప్పదు. షూట్ చెయ్యి" అన్నాను.

"ఎవడు మేంగో ఆడవారి నోటిలో మాట దాగదన్న పురుషోత్తముడు. మీ మగవారి నోటిలో ఏది దాగుతుంది? నీలోనూ పురుషాహంకారం మొదలవుతోంది" అని కోప్పడింది.

విదూ కూడా సైలెంట్‌గా వున్నాడు.

"ఈ ముక్క ఎవరన్నా నేను కోట్ చేయాల్సింది కాదు. నన్ను క్షమించు. తుఫాన్‌కి ముందు ప్రశాంతత లేదా నిశ్శబ్దం అని నేను అనుకోలేదు" అన్నాను.

"ఇన్ని జరుగుతున్నా మనం ఏమీ మాట్లాడలేకపోతున్నాం. మన అభిప్రాయాల గురించి ఎవరన్నా అడిగారా ఇంట్లోగాని, బయటగాని" అంది అన్య సీరియస్‌గా.

"అడగరు" అన్నాడు విదూ అంతే సీరియస్‌గా.

"ఎందుకు?" అన్నాను.

"మనకు ఓటు హక్కు లేదు కాబట్టి!" అన్నాడు.

ఒక్కసారిగా నిశ్శబ్దం. విదూ గాడు బాంబు పేల్చాడు.

"అందుకు పద్దెనిమిది సంవత్సరాలు నిండాలి కదా!" అన్నాను.

"ఎందుకు నిండాలి?" అంది అన్య.

"ఇదేదో సీరియస్ టాపిక్. మన ఛానల్‌లో ఈ విషయం మీద చర్చ పెడదాం. అందులో అన్య వుంటుంది. అలాగే మిస్టర్ క్లీన్ అండ్ ది గ్రేట్ క్రిటిక్ వుంటారు. నేను యాంకర్‌గా వుంటాను" అన్నాను.

అప్పటికప్పుడు వారిని కలుసుకున్నాం.

"నేను ఫ్రీచర్చే. కానీ ఇలాంటి చర్చల్లో నేను పాల్గొనను" అన్నాడాయన.

"అదేంటి?" అన్నాం."మీ చర్చ అరగంట లేదా గంట వుంటుంది. అందులో నలుగురు కనీసం వుంటారు. ఇందులో యాంకర్ గారి అది పురుషుడైనా, మహిళ అయినా పది నిమిషాలు ఇంట్రో వుంటుంది. వడదెబ్బ తగులుతుంది చూసే వాళ్ళకి. తర్వాత అయిదు నిమిషాల ప్రకటనల జాతర వుంటుంది. అది అరగంటైనా గంటయినా యాంకర్ ఎన్ని నిమిషాల ఉపన్యాసం, మధ్యలో ఎన్ని నిమిషాల జోక్యం, గెస్టులు ఎంతసేపు మాట్లాడతారు లెక్కలు తీయండి" అన్నాడు.

"అయితే ఏమంటారు మెంటార్‌జీ" అన్నాం ముగ్గురం."ఈ మాత్రం భాగ్యానికి పనులన్నీ మానుకుని స్టూడియోకి వెళ్ళాలా. చర్చ ఫ్రమ్ హోమ్ చేయాలా? ఉదయం పూట ప్రవచనాలు చెబుతుంటారు కదా. వారిని ఎవరూ డిస్టర్బ్ చేయరుగా. అలాగే ఈ యాంకర్స్ కూడా ఉపన్యాసం, తనే ప్రశ్నలు వేసుకుని, తనే జవాబులు చెప్పుకుంటే సరిపోతుంది కదా" అన్నాడు.

ముందే చెప్పాం కదా మా పెర్‌ఫెక్ట్ గారు ఈకకు ఈక తోకకు తోక పీకి పాతరేస్తారు అని. వారికి అలాంటి ప్రమాదం లేదని, మీరు మాత్రం ఎంతసేపయినా మాట్లాడవచ్చు. మా తరపున అన్య మాట్లాడుతుంది అని కన్విన్స్ చేశాం.

"మాకు కూడా ఓటు హక్కు కావాలి. అప్పుడే అయిదు సంవత్సరాలకు మధ్య మధ్యలో వచ్చే ఎన్నికలకు మమ్మల్ని మనుషులుగా గుర్తిస్తారు" అంది అన్య.

"పుట్టగానే పౌరసత్వం వచ్చినట్లు మీరు ఓటు హక్కుతోనే పుట్టమంటున్నారా?" అన్నాడు గురూజీ. "అవసరం లేదు. ఇప్పుడు ఆరు సంవత్స రాలు నిండితేనే మొదటి తరగతి అంటున్నారు. ఆరు సంవత్సరాలకు ఓటు హక్కు కల్పించాలి. మీకు బటన్ నొక్కటం చేతవునా అంటారు. రెండు సంవత్సరాల నుండే పిల్లలం బటన్లు నొక్కుతున్నాం కదా!" అంది అన్య.

"అంతేనా ఎన్నికల్లో పోటీ చేస్తారా?"

"అవన్నీ తర్వాత నిర్ణయించుకుంటాం. మేం కూడా పార్టీలు పెడతాం. ఐస్‌క్రీమ్ కొండలు, సాఫ్ట్ డ్రింక్స్ పూల్‌లు, చాక్లెట్ల మందిరాలు ఏర్పాటు చేస్తామంటాం. ఇంకా మేం చెప్పాల్సినవి, చేయాల్సినవి చాలా వున్నాయి" అంది అన్య.

"ఇదీ విప్లవం అంటే. అయినా ఆరు సంవత్సరాలకు మెచ్యూరిటీ ఎలా సాధ్యం అంటారు. దీనికి మీ సమాధానం ఏమిటి?" అన్నాడు గురూజీ.

"అయ్యా! మీరు యాంకర్ పాత్రను పోషిస్తున్నారు" అన్నాను."అదేం లేదు. అన్యని మాట్లాడనీ" అన్నాడు గురూజీ.

"మెచ్యూరిటీ అనగానేమి? అది ఎన్ని సంవత్సరాలకు వస్తుంది. ఇరవైకా, అరవైకా, అసలు ఎప్పటికీ రాదా? మనం ఇన్ని దశాబ్దాల నుండి ఎన్నికల తతంగం చూస్తున్నాం. ఎంతమంది ఓటు వేస్తున్నారు? వేయనివారికి అవి ఎందుకు? ఇంకా మద్యం, డబ్బులు తీసుకోకుండా ఎంతమంది ఓటు వేస్తున్నారు. ఉచితానుచితాలు లేకుండా ఎవరయినా 'ఫ్రీ' అనకుండా ఎన్నికలకు వెళ్తున్నారా? ఇదేనా మెచ్యూరిటీ అంటే. నా ముడ్డి కాకపోతే కాశీదాకా దేకుతానన్నాడంట ఎవరో-మా అమ్మమ్మ చెబుతుంది. ఫ్రీగా ఎవడయినా ఇచ్చేదేంటి గురూజీ. అన్నీ పుచ్చు కోవటమే కదా. ఇప్పటికి ఎన్నిసార్లు రాజ్యాం గం మార్చలేదు. అందుకని పిల్లలూ ఓటర్లే అని ఇంకోసారి మార్చండి" అంది అన్య ఆవేశంగా.

"శభాష్ పిల్లలూ. ఇది ఇప్పట్లో తేలే అంశం కాదు. ఇంకో రెండు మూడు సెషన్లు కావాలి. ముందుగా నేను మీకు మద్దతు ప్రకటిస్తున్నాను. పిల్లలకు ఓటు ఇవ్వటానికి పెద్దలూ, రాజకీయ పార్టీల వారూ ఒప్పుకుంటారు. కాకపోతే ఆడవారికి సగం సగం అంటే ఒప్పుకోరు. ముందు ఓటు హక్కు వచ్చాక ఆకాశంలో పిల్లల వాటా ఎంతో తేల్చుకుందాం'' అని మిస్టర్ క్లీన్ ముక్తాయించారు.

# విభిన్న వ్యాసాలు




ప్రతులకు:
డా॥ జి. శ్యామల,
ఫ్లాట్ నెం.203,
మారుతి హైట్స్
న్యూ మారుతి నగర్
చైతన్యపురం-500 060
హైదరాబాద్
సెల్: 97041 75183



"సాహిత్య దీపిక"
డా॥ గద్దం శ్యామల వ్యాసాలు
పుస్తకానికి
**డా॥ ఏనుగు నరసింహారెడ్డి**
రాసిన
ముందుమాట..

ప్రాచీన కాలంలో ఒక కావ్యంలోని గుణదోష విచారాలే ఆ కావ్యం యొక్క స్థాయిని నిర్ణయించడానికి ఉపయోగపడే పరికరాలు. కావ్యంలోని కథ, కథన పద్ధతి ఇందులో ప్రధాన మైన విషయాలు. కథలో కూడా సుఖాంతమైన కథ లేకుండా, నైతిక వర్తనతో కూడిన కథ లేకుండా సాగిన రచన తప్పనిసరిగా నిరసించబడేది. ఆధునిక కాలపు విమర్శ దీనికి భిన్నం. ఇది ఆంగ్ల సాహిత్య ప్రభా వంతో తెలుగులో స్థిరపడ్డ ఒక ప్రక్రియ. •Literary criticism is essentially an opinion, supported by evidence, to theme, style, setting or historical or political context అనడం ద్వారా కావ్యం దాని లక్ష్యాన్ని అనుసరించి అది నడిచే రూపాన్ని ఏర్పరచుకుంటుంది. ధర్మవరం రామకృష్ణమాచార్యులు తెలుగులో మొదటగా ఒక విషాదాంత నాటకం 'విషాద సారంగధరం' రాశారు. ఆ నాటకాన్ని విమర్శిస్తూ ఎవరైనా వ్యాసం రాసి ఇది భారతీయ సుఖాంత నాటక సంప్రదాయానికి భిన్నమైనది కాబట్టి ఇది గర్హనీయ మని అంటే అది సరియైన విమర్శ అనిపించుకోజాలదు. ఎందుకంటే ఆ నాటకం లక్ష్యం భిన్నం. చరిత్రలో దొరికిన ఆధారాలు అస్పష్టంగా ఉండి, ఆ కథ మొత్తంలో చిత్రాంగిని దుష్ట నాయికగా చిత్రించే ప్రయత్నం జరిగింది. అందువల్ల ఈ నాటకాన్ని ధర్మవరం వారు ఒక నూతన దృష్టి కోణంతో రచించారు. అందరూ సహృదయులే అన్న పద్ధతిలో నాటకాన్ని నడిపించడానికి ప్రయత్నించారు. దానికి ఆయన కథలో అతి స్వల్పమైన మార్పులు చేశారు. అందులో ప్రధానమైనది చిత్రాంగికి వేంగీ వంశపు కోడలిగా అవకాశం వచ్చినట్లు చెబుతారు. ఆమె మనసులో సారంగధరుడు ఉంటాడు. ఆయన వేంగీ యువరాజు కాబట్టి తన ఆలోచనకు తగిన సంబంధం అని ఆమె మురిసిపోతోంది. అట్లాగే సారంగ ధరుడి ముందు వేంగీ వంశానికి కోడలి వెతుకు లాట ప్రారంభమైనట్లు చెబుతారు. అందువల్ల ఆ వెతుకులాట తన భార్య కోసమేనని సారంగధరుడు భావిస్తాడు. రాజరాజ నరేంద్రుడు తాను వివాహమా డదలచి తన రాజ్యంలో పెళ్లి కుమార్తె కోసం వర్తమానాలను తెప్పించాడని ఇంకొక అవగాహన కల్పిస్తాడు నాటకకర్త. ఇందులో ముగ్గురూ తమ దృష్టి కోణం నుంచి ఆలోచించు కోవడం వల్ల చివరకు సారంగధరున్ని చిత్రహింసల పాలు చేయ వలసిన అనివార్యమైన పరిస్థితి వచ్చిందని నాటకకర్త కల్పించాడు. ఈ సందర్భంలో విమర్శకుడు పాత పరికరాలకు ఉపయోగించి చేసే విమర్శ ప్రయోజనాత్మకం కాదు. ఈ నాటకంలోని కథ రచయిత లక్ష్యానికి అనుగుణంగా నడిచిందా లేదా, పాఠకుడి హృదయాన్ని తట్టిందా లేదా అన్నది చూస్తేనే విమర్శ ప్రయోజ నాత్మకంగా ఉంటుంది. అలా ఉండాలంటే విమర్శకుడు తప్పని సరిగా సహృదయుడై ఉండాలి. విమర్శలో అనేక రకాలు ఉన్నప్ప టికీ ప్రధానంగా విమర్శకుడికి ఉండాల్సిన సహృదయ లక్ష ణాన్ని ఏ విమర్శా తిరస్కరించలేదు. ఈ నేపథ్యంలోనే గద్దం శ్యామలగారు తెస్తున్న సాహిత్య దీపిక వ్యాసాలను పరిశీలించ వలసి ఉన్నది.

నవలల మీద రాసినవి, కవిత్వం మీద రాసినవి, సాహిత్యకారుల సమగ్ర సృజన మూల్యాంకనం చేసి రాసినవి. తెలుగు భాష మీద, రచయిత్రి వైయక్తిక జీవన స్పంద నలతో రాసినటువంటి వ్యాసాల సమాహారం ఈ దీపిక.

ఇవి ఒకనాడు ఒక ప్రత్యేకమైన లక్ష్యం (target) తో కూర్చొని రాసిన వ్యాసాలు కావు. నిజానికి ఆయా సందర్భాలు డిమాండ్ చేసి నప్పుడు రాసిన వ్యాసాలు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అవసరం డిమాండ్ చేసినప్పుడు రాసిన వ్యాసాలు. ఇష్టంగా రాసిన వ్యాసాలు. కాబట్టి విమర్శ ఒక thank less job అన్న మాట ఇక్కడ సరికాదు. ఎందుకంటే రచయిత్రి మీద ఏ ఒత్తిడి లేకుండా రాయబడ్డ వ్యాసాలు ఇవి. అందువల్ల రాయడంలో ఆసక్తి ఉంది. అది పాఠకుడిని ఆసక్తికరంగా చదివిస్తూ ఉంది.

నవల సామాజిక దృక్పథం అనే వ్యాసంలో తెలుగు నవల చరిత్రను రాస్తూ కాలం తెచ్చిన మార్పు వల్ల నవలలకు ఇది సరిపోయే కాలం కాదేమో అన్న అభిప్రాయానికి పాఠకులు వచ్చేలా వ్యాఖ్యానిస్తారు విమర్శకురాలు. అయితే ఒక్క నవలకే కాకుండా మిగిలిన సాహిత్య ప్రక్రియలు అన్నింటికీ కూడా డేంజర్ బెల్స్ మోగుతున్నప్పటికీ మిగిలిన ప్రక్రియలను రక్షించడానికి కొద్దో గొప్పో వేదికలు ఉన్నాయి కానీ నవలను రక్షించ డానికి అలాంటి వేదికలు ఏవి ఉన్నట్లు లేవు అంటారు. ఇది పాక్షికంగా వాస్తవమే అయినప్పటికీ అంపశయ్య నవీన్ లాంటి వారు కొత్త నవలాకారులను ప్రోత్సహించడం కోసం ఒక బహుమతి పరం పరను ఏర్పాటు చేశారు. స్త్రీవాద నవలలను చర్చిస్తూ స్త్రీవాదం కవిత్వంలో వచ్చినంతగా నవలలో రాలేదని చెబుతారు. 1990 తర్వాత వచ్చిన నవలల్లో స్త్రీవాదం చాలా తక్కువ అంటారు. తెలుగు నవలల్లో మరపురాని పాత్రల గురించి లోతైన విశ్లేషణ చేస్తారు. రంగనాయకమ్మ జానకి విముక్తి లోని జానకి గురించి, రావూరి భరద్వాజ పాకుడు రాళ్లు నవల లోని మంజరి గురించి, శ్రీదేవి రాసిన కాలాతీత వ్యక్తులులోని ఇందిర పాత్ర చిత్రణ గురించి లోతైన విశ్లేషణ చేశారు గద్దం శ్యామల గారు. నవలలోని వస్తువుని బట్టి వర్గీకరణ కూడా చేశారు. జాతశ్రీ మూడు నవల లను స్పృశిస్తూ రాసిన నివాళి గా, సలీం గుర్రపు డెక్క నవల మీద, ప్రభాకర జైనీ హీరో నవల లోని స్త్రీపాత్రల గురించి, డాక్టర్ ఎం. సుగుణా రావు కథల మీద రాసిన వ్యాసాలతో గద్దం శ్యామలగారు నిరంతర అధ్యయన శీలత తెలిసి వస్తుంది. ఈ వ్యాసాల్లో కొన్ని సెమినార్ల కోసం పరిశోధించి రాసినవి కాగా, కొన్ని ఆయా నవ లలను చదివినప్పుడు స్పందించి రాసినవి. ఒక్కో నవలను ఒక్కో ప్రత్యేకమైన శీర్షికతో చర్చించడం వల్ల ఆ శీర్షిక ఆ నవలలోనే ప్రధానమైన కోణాన్ని దృష్టిలో పెట్టుకొని రాయబడింది అని పాఠకులకు అర్థమవుతుంది.

ద్వితీయ అధ్యాయంలో కవిత్వ చర్చలో భాగంగా డాక్టర్ సి. నారాయణరెడ్డి **'నాగార్జున సాగరము' గేయ కావ్యం,** గుర్రం జాషువా రచించిన **'నాగార్జున సాగర్'** పద్య కావ్యం తులనాత్మక పరిశీలన ఈ పుస్తకానికి ఒక మకుటాయ మానమైన అధ్యాయం. జాషువా రచనల్లో గబ్బిలం, ఫిరదౌసి లాంటి ప్రసిద్ధ కావ్యాలతో పాటు ఇతర ఖండ కావ్యాలను చర్చిస్తారే కానీ నాగార్జున సాగర్ పద్య కావ్య చర్చ చేసిన ఔత్సాహిక విమ ర్శకులు అరు దు. ఈ కావ్యం గురించి పరిశోధకులు పట్టి ంచుకొని ఉంటారు. డాక్టర్ సి. నారాయణరెడ్డి నాగార్జున సాగరం గేయ కావ్యం మాత్రం విస్తృతంగా చర్చల్లోకి వచ్చింది. ఈ రెండింటి తులనాత్మక అధ్యయనంలో భాగంగా జాషువా శ్రీనాధుని పద్యాలకు జవాబు చెప్పినట్లుగా ఉన్న రచనగా, మరొకటి చరిత్రకు ప్రణయాన్ని అద్దినట్లుగా ఉన్న కథగా అపురూపంగా చర్చించారు విమర్శకురాలు. నిజానికి ఈ రెండు కావ్యాలు ఆధునిక దేవాలయమైన నాగార్జున సాగర్ నిర్మాణ ప్రేరణతో రాయబడ్డవి. ఎందుకో విమర్శకులు ఈ చారిత్రక అంశాన్ని తరచూ విస్మరిస్తుంటారు. గద్దం శ్యామల గారు మాత్రం ఒకచోట మంచి ప్రాజెక్టులు కట్టబడినాయి అని అన్నారు. నిజానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టు 1955లో ప్రారంభమై, 1967లో పూర్తయింది. ఈ రెండు కావ్యాల మీద దాని నిర్మాణ ప్రభావం స్పష్టంగా ఉంది అని పరోక్షంగా చెప్పారు.

సినారె రాసిన మరో రసవద్గుళిక 'కర్పూర వసంత రాయలు' మీద మంచి వ్యాసం రాస్తూ, ఆ కావ్యంలోని కథను చర్చించారు. కుమారగిరి లకుమాదేవిల వైయక్తిక ప్రేమ కన్నా సంఘ ప్రేమ గొప్పదని పట్టమహిషి చేత ప్రేరేపించబడిలకుమాదేవి తన జీవితాన్ని త్యాగం చేయడంతో ఈ కథకు డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎనలేని ఉదాత్తీకరణ కల్పించారని చెప్పడం వీరి విమర్శలోని సుగుణ కోసం. ఇదే విభాగంలో భారతంలోని రెండు కథలకు వ్యక్తిత్వ వికాసంతో ముడిపెట్టి చేసిన విశ్లేషణ కొంత సంప్రదాయ ముద్రతో ఉన్నప్పటికీ ఆదర్శప్రా యమైన వ్యక్తిత్వ నిర్మాణం కోసం పాటుపడే వారికి ఉండాల్సిన లక్షణాలను ఇక్కడ చెప్పారు. మానధనాన్ని కాపాడుకోవడం, కీర్తిని సంపాదించడం, సత్య సంధులుగా నిలబడడం ప్రహ్లాదుడి ద్వారా, వామనుడి ద్వారా తెలుసుకోవలసిన విషయాలని చెప్పారు. ఎండ్లూరి సుధాకర్ "ఆర్ద్ర గీతికలు", పెన్నా శివరా మకృష్ణ **పెన్నా సరాలు, అశ్రుధార,** ఏనుగు నరసింహారెడ్డి **తెలంగాణ రుబాయిలు,** శాంతి **కృష్ణ చినుకు తాకిన నేల,** చం దూరు రవికుమార్ **మహా ప్రసాదం,** విజయభేరి, విల్సన్ రావు **నాగలి కూడా ఆయుధమే,** విజయ గోలి **నా కల నా స్వర్గం** పుస్తకాల మీద సవివరమైన సమీక్షలు రాశారు. ఇంకో వ్యాసంలో అంతర్జాలంలో రాస్తున్న కవయిత్రుల కవి త్వం గురించి ఒక సమీక్షాత్మ కమైన వ్యాసం రాశారు.

మూడవ అధ్యాయంలో ఆచార్య ఎస్.వి.రామారావు గారి విమర్శ పద్ధతి మీద పురుషోత్తమాచార్యకు జాతీయ సినీ పురస్కారం వచ్చిన సందర్భంగా రాసిన వ్యాసాలతో పాటు శ్రీశ్రీ మీద రాసిన అభిప్రాయాత్మక వ్యాసం ఆసక్తికరంగా ఉంది. సూరారం శంకర్, కొరుప్రోలు మాధవ రావు, పెన్నా శివ రామకృష్ణ మీద వ్యక్తిత్వానికి సృజనకు ఉన్న సంబంధాన్ని వివేచించారు.

మరో అధ్యాయంలో తెలుగు భాష మనుగడ గురించి, జానపద విజ్ఞానం లో సాంస్కృతిక వస్తువుల గురించి రాశారు. మరో అధ్యా యం లో శ్రీవారికి క్షేమలేఖ, విమర్శకురాలి జ్ఞాపకాలు, వ్యక్తిగా వారి మాతృమూర్తి జీవన పోరాట శీలత ఇందులో చేర్చడం జరిగింది.

సాహిత్య వ్యాసం కానప్పటికీ గద్దం కృష్ణకుమారి గారి మీద రాసిన వ్యాసం అపురూపమైంది. ఆమె పుట్టింటి నుండి నల్లగొండకు చేరి, అనతికాలంలోనే భర్తను కోల్పోయి, అప్పుడు తప్పనిసరై తిరిగి చదువుకొని ఉద్యోగం చేసి ప్రభుత్వ ఉద్యోగం నుండి ప్రైవేటు ఉద్యోగానికి మారి తన కూతుళ్ల ను ఒక వ్యక్తిత్వమున్న విద్యావంతులుగా తయారు చేయడంలో ఆమె చూపిన చొరవ సాహసం పాఠకులకు కన్నీళ్లు పెట్టించక మానదు. ఆమె వ్యక్తిత్వం ఒక జీవిత చరిత్రగా రాయవలసినంత స్ఫూర్తిదాయకంగా అనిపిస్తుంది.

గద్దం శ్యామల గారు కవ యిత్రిగా- ప్రత్యేకించి గజల్ కవయిత్రిగా సుప్రసిద్ధులు. వారు విమర్శకులుగా ఈ గ్రంథంతో తొలిసారిగా పరిచయమవు తున్నారని తెలుసుకోవటమే కానీ వీరు ఎప్పటి నుండో సాహిత్య రంగంలో చేస్తున్న కృషి చాలా ఉంది. చాలా సెమినార్లలో చేసిన పత్ర సమర్పణలు ఆసక్తి కోసం రాసిన టువంటి విమర్శలు, సమీక్షలు ఇందులో ఉన్నాయి. ఔత్సాహిక విమర్శ ఎంత ఆసక్తికరంగా ఉంటుందో చూడా లంటే సాహిత్య దీపికను అక్షరం అక్షరం చదవాల్సిందే.

-డా॥ఏనుగు నరసింహారెడ్డి
సెల్:8978869183



---

**కణిక** సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక
## 'బుధవారం బాద్షా'
నిర్వహిస్తున్న
**పోటీ ఫలితాలు**



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**



## నిశీధిలో ఉషోదయం

నిరాశ నీడై వెంటనడుస్తుంటే
చీకటి తలుపులు తెరచి దూసుకువస్తుంది
ఆశ ఊపిరి నింపుకొని అడుగులేస్తుంటే
వెలుగు వేడుకచేయ చిందులు వేస్తున్నది.
నమ్మకము అమ్ముడుపోతే
భరోసా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నది
అంధకారము అధికారపీఠమెక్కి
ఆశలన్ని ఆవిరిచేస్తుంది.
బాధ బలాదూర్ అంటు
ఎదలో సునామిలేపితే
ఎండమావులు ఊరిస్తు
అండలేని ఎడారిలో వదిలేస్తే
ధైర్యం వెలుగురేఖై
లోకాన్ని చూపిస్తుంది.
కాలం పరీక్షలు పెడుతుంటే
జీవితం నెగ్గేపనిలో ఆరాటపడుతుంది
ఫలితాల పరేషాన్ చేస్తుంటే
చీకటి పహరాకాస్తు లోకాన్ని చూడనివ్వనప్పుడు
మరల తపించే ప్రయత్నం
వెలుగును చూపిస్తుంది.

-డా.బి.సుధాకర్

## నిశీధిలో ఉషోదయం

కాలం భలే చిత్రమైంది
నడిచే దారిలో
పూలను పరిచినట్టే పరుస్తుంది
అంతలోనే ముళ్ళమయం చేసి
సవాల్ విసురుతూ అగమ్యంగా మారుస్తూ
ఆత్మ విశ్వాసాన్ని తూకం వేసి పరీక్షిస్తుంది...
ఎడారిలో తప్పిపోయిన ఒంటరి బాటసారిగా మార్చి
సమస్యల తుఫాన్లతో చుట్టుముడుతుంది.
ఆకలికి గుక్కిళ్లే ఆశ అన్నట్టు
దిగమింగుకున్న వేదన
సడలని పట్టుదల
వెన్ను చూపని మొండి ధైర్యం.
నిశీధిలో ఉషోదయమై
సంకల్పాన్ని జాగృతం చేసి
భవిష్యత్ బాటలో వేస్తున్న
పాదముద్రలను
చెరగని చరిత గురుతులుగా చెక్కుతుంది...
మొక్కవోని మనో నిబ్బరంతో
నిర్భయంగా ఎదుర్కొనే జీవిత పాఠాలను నేర్పుతున్న
అంతరంగం చేయి విడవక నడిస్తే చాలు
కాలమే సలాం చేస్తుంది
చీకటిని చీల్చే దారి దీపాన్ని
బహుమతిగా ఇచ్చిమడమ తిప్పని సాహసాన్ని
విజయాల మాలతో అలంకరిస్తుంది...

-పురిమళ్ల సునంద (భోగోజు)
ఖమ్మం

## నా అర్ధభాగం

కర్రే పామై కాటేసే సమయం
ముట్టుకుంటే భగ్గుమంటున్న వ్యవహారం
ఏది తలపెట్టినా కలిసిరాని కాలం
కరువులో అధిక మాసం
అన్నట్టుంది నా వ్యవహారం.
అన్నం పెడుతున్న కర్మాగారం
బేరాలు లేక మూత పడ్డ తరుణం
రోడ్డున పడ్డది ఉన్న పళాన జీవితం
బతుకయ్యింది నిశీధి మయం.
అప్పు చేసి పెడితే చిన్న హోటల్ వ్యాపారం
గ్యాసు బండలు కరువై మూతపడ్డ వైనం
అప్పులకు వడ్డీలు ఆయెను అధికం
వెంటాడుతుంటే అచ్చిరాని కాలం
బతుకయ్యింది నిశీధి మయం..
ఇల్లాలే ఇంటికి దీపం, అన్నది సూక్తం
నమ్మి వచ్చిన ఇల్లాలయ్యింది నా పాలిట దైవం
తన పుట్టింటి వారు పెట్టిన ఆభరణం
అమ్మి నాతో పెట్టించిందో చిన్న దుకాణం
దానితో కుదుట పడ్డ నా జీవితం
ఊపిరి పీల్చుకుంటున్నది దిన దినం.
నిశీధి నుండి ఉషోదయానికి నా పయనం
పుంజుకున్నదంటే, అది ఇల్లాలి పుణ్యం
నా అర్ధభాగమే, నాకు నిశీధిలో ఉషోదయం.

-జె వి కుమార్ చేపూరి

## ఘన సందేశం

నిశీధి నిండిన గుండెలో నిశ్శబ్దం గూడు కట్టగా
నీరసమైన కలలన్నీ నీడలై జారిపోగా
ఆకాశమంత ఆవేదన అంచులదాకా చేరినా
ఆశ అనే చిరుదీపం ఆరిపోక నిలిచింది.

చీకటి చీర కప్పుకొని కాలం నిదురించిన వేళ
కనురెప్పల సందుల్లో కనుమరుగైన స్వప్నాల వేళ
ఒక చిరునవ్వు దూరాన ఉదయరేఖై తొంగిచూసెంది.

ఒక మధురస్పర్శ హృదయ తంత్రులపై గీతమై వీచింది
వేదనల వర్షంలో తడిసిన మనసు ముడుచుకున్నా
వెచ్చని కిరణమై ఆశ మళ్లీ పలకరించింది.

గతపు గాయాలన్నీ గాథలై మిగిలిపోయినా
సరికొత్త ఊహలు రేపటి వెలుగుల కోసం
రెక్కలు విప్పుకున్నాయి.

నక్షత్రాల కన్నీళ్లను తుడిచే తొలి అరుణిమ
నిరాశల గర్భంలో పుట్టే నవజీవన మహిమై వెలిసింది
ప్రతి చీకటి వెనుకా వెలుగొకటి దాగి ఉందని
ప్రతి ఓటమి వెనుకా గెలుపొకటి నిలిచి ఉందని
నిశీధి నేర్పిన పాఠం సహనమేనని తెలిసింది.

అంతులేని రాత్రికైనా అంతిమ ఘడియ ఉంటుందని
అలసిన హృదయానికీ ఆనంద ప్రభాతం వస్తుందని
నిశీధిలో ఉషోదయం
ఇస్తుంది ఘన సందేశం

-మక్కువ. అరుణకుమారి
విజయనగరం

## కొంగు నీడలు

కొంగులు
చెట్ల నీడల్లాంటివి !
కొంగుల చీరల్లోని ప్రాణ రూపాలు
మాంస ఖండాలు కావు !
పొదుల్లోని మొక్కల్లోంచి మానులై
పత్రఛాయలతో, పసిడి పళ్లతో చెట్లు ప్రాణాధారాలైనట్లు
తరువులూ, తరుణిలూ
నేల మీది అక్షయపాత్రలు,
నింగిలోని సూర్యచంద్ర కాంతులు !
ఆదర్శాలు అడుగంటిస్తూ
అధికార దర్ప పడగలతో విషపు లోకాన్ని వ్యాపింప జేస్తూ
ప్రేమానుభూతులని పాతాళం లోకి నెట్టేస్తూ
దగావ్యాపార వాతావరణం అలముకున్న వేళ
తరువులూ, తరుణిలూ
ఎండి మండిపోతూ మసైపోతున్నారు !
అమ్మవొడి లాంటి నేలతల్లి
నేలతల్లి లాంటి అమ్మవొడి
కరువు వరదల్లో కొట్టుకుపోతున్నారు !
ధాన్యం గింజలని అందించిన చెమట గింజలని
గుంజీలు దీయిస్తున్నారు, గూళ్ళు విరిచేస్తున్నారు !
తక్కెడ పళ్లాలని ఎప్పుడు సమంగా నిలబడనీయడం లేదు!
పైరు పైటలు ఎగరాలంటే
లింగభేదాన్ని గంపలకింద మూసేయ్యాలి !
పుట్టే పసికందులన్నీ పచ్చని పైర్లవ్వాలి!
ఇచ్చల ముచ్చట్లతో కాలాన్ని వెచ్చబెట్టుకోవాలి !
నేర సూర్యోదయాలే తప్ప
వీర పరువు శుభోదయాలు,
పరోపకార జీవనాలు నిమ్మలించవా !

-ఒబ్బిని
9849558842

---

# రఘువీర్ ప్రతాప్ కవిత్వ యానం

ఎస్వీ రఘువీర్ ప్రతాప్
రచించిన
**'మరువంపువూల మట్టితీగ'**
పుస్తకానికి
**డా॥అమ్మంగి వేణుగోపాల్**
రాసిన ముందుమాట.




**ప్రతులకు:** ఎన్.వి.రఘువీర్ ప్రతాప్
ఇ.నెం.9-6-369, ఫ్లాట్ నెం.103
రోడ్ నెం.1/14, మారుతినగర్
చంపాపేట్, హైదరాబాద్-59
సెల్: 9440551552

రఘువీర్ ప్రతాప్ గత మూడు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో కృషి చేస్తూ ప్రధానంగా కత్వ శాఖలో అనేక ప్రక్రియల్లో తన ప్రతిభను విస్తృతపరుచుకుంటూ వస్తున్నాడు. అటవీ శాఖలో ఉన్నతోద్యోగిగా పనిచేస్తూ సాహిత్య రంగంలో సమున్నతంగా ఎదిగి షష్టిపూర్తికి చేరువలో ఉన్నాడు. 15కు పైగా పుస్తకాలు రచించాడు. విదేశీయా లైనా, గజల్, రుబాయిలను సవాల్‌గా తీసుకొని రాసిన తీరు, లఘు కవితలను అభిమానించి చేసిన సాధన ఎవరినైనా అబ్బురపరుస్తుంది. సంస్థల నిర్వాహణ మూలంగా రఘువీర్ వ్యక్తిత్వం పరిపూర్ణమైంది.

"ఈ కవిది తెలుగు సాహిత్యంలో చెరుపలేని సంతకం. మొత్తం సాహిత్య ప్రయాణాన్ని పరిశీలిస్తే వస్తుపరంగా, భావ పరంగా తనదైన పరిభాషలో చాలా సరళ మైన వ్యక్తీకరణతో ఎటువంటి అస్పష్టతకి తావు లేకుండా అవలోలక కవిత్వం చేసే విభిన్నమైన సృజన కారుడు" రఘువీర్ అంటూ డాక్టర్ బాణాల శ్రీనివాసరావు వంటి విలక్షణకవి అన్నారంటే అది నిజంగా ఒక యోగ్యతా పాత్రమే!

"అమ్మ గురించి రాసిన కవితలలో పరకాయ ప్రవేశం చేసి రాసినట్లు రచనలు" డాక్టర్ బండారి సుజాతాగారికి ప్రత్యేకంగా నచ్చాయి. రఘువీర్ విడివిడిగా కవితా ఖండికలలోనే కాకుండా, ప్రత్యేకంగా 'అమ్మంటే' అన్న మాతృ మూర్తి భావనకు గౌరవాన్ని చేకూర్చ డానికి ఒక కవితా సంపుటే రాశాడు. అంతటితో ఆగ కుండా దాన్ని "మదర్" అన్న పేరు తో స్వయంగా ఆంగ్లంలోనికి అనువదించారు. సబ్జెక్టివ్ ఎలిమెంట్‌ను అబ్జెక్టివ్‌గా మార్చిన రఘువీర్ శక్తికి ఇది తార్కాణం. దైవభావన మనసులో ఇంకినప్పుడు లోకమంతా దేవుడే కనిపించినట్లు, కవికి సర్వత్రా అమ్మే దర్శనమిస్తుంది. చివరకు సముద్రంలో కూడా

**"సముద్రం**
**అమ్మఒడి**
**తుళ్ళిపడే అలలు**
**అల్లరి పిల్లలు!"** అంటాడు రఘువీర్.

నిరంతరం అసహనంతో ఘూర్ణిల్లుతూ ఒక్కోసారి బీభత్సంగా భయపెట్టే సముద్రం అలలు 'తల్లి ఒడిలో ఆడుకునే అల్లరి పిల్లలు'గా కవికి దర్శనమిచ్చాయంటే అతని అంతర్దృష్టిలో తల్లి భావన ఎంతగా ఇంకిపోయిందో ఊహించుకోవచ్చు.

తల్లిని ప్రేమించేవాడు ప్రపంచాన్ని ప్రేమిస్తాడు. ఇది రఘువీర్ తర్వాతతరం కవులకు ఆదర్శప్రాయమవుతుంది.

విదుషీమణి శైలజామిత్ర గారు 'కాంతివంతమైన రఘువీర్ కవిత్వం' అన్న వ్యాసం రాస్తూ "ఇంకా చలం, శ్రీశ్రీ, జాషువా, దాశరథి, ఆత్రేయ, ఆరుద్ర, శేషేంద్ర వీరందరి గూర్చిన చర్చలు సమావేశాలు అవసరమా? వారేనాడో గుర్తింపు పొందారు" అని కొందరంటుంటారని అది సరైంది కాదని వ్యాక్యానించారు. విశాల సంస్కృతిలో భాగమైన సాహిత్యం పరంపరాగతంగా మనకు సంక్రమించింది. అలనాటి దీపధారుల కాంతిని మనం ఆవాహన చేసుకున్న పుడే పరిపూర్ణత చేకూరుతుంది.

**'గజల్ జ్యోత్స్న'**ను అకడమిక్‌గా పరిశీలించిన గజల్ కవయిత్రి డాక్టర్ గద్దం శ్యామల గారు అది విలాయతీ ప్రక్రియ కావటం వల్ల పరిపూర్ణత సాధించడానికి బాగా పరిశ్రమించి మరో గజల్ సంపుటిని వెలువరించాలని సూచించారు.

'గజల్ పాడితేనే' దాని మాధుర్యం తెలుస్తుంది, అంటున్న ఎ. రజా హుస్సేన్ గారు

**'కనులు రెండు కలుసుకుంటే ప్రణయ గీతం అవుతుంది.**
**మనసులోతు తెలుసుకుంటే మధురగీతం అవుతుంది'** వంటి తమకు నచ్చిన పంక్తుల్ని ఉదహరించారు.

సీనియర్ కవి కొమ్మవరపు విల్సన్‌రావు గారు రఘువీర్ 'కవిత్వ పదజాలం, పద చిత్రాలు ఒక రూపులో ఉండి పాఠకులను అమితంగా ఆకర్షిస్తాయి' అంటున్నారు.

రమణ వెలమకన్ని గారికి రఘువీర్ గజళ్ళు 'మానవీయత, తాత్వికత ఆధ్యాత్మికత' ముప్పేటగా అల్లు కుపోయి కనిపిస్తు న్నాయి.

రఘువీర్ రుబాయిల సంపుటి కావ్య మధులికను గూర్చి చర్చిస్తూ కవయిత్రి, రచయిత్రి పురిమళ్ళ భోగోజు సునందగారు 'ఈ పుస్తకం ప్రతి పాఠశాలలో ఉండాలని, అంతేకాదు నైతిక సామాజిక, పర్యావరణ, ప్రాపంచిక విలువల్ని బోధించే ప్రతి ఉపాధ్యాయుడు వద్ద ఈ పుస్తకం ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. ఇవి నిజంగా ఆ పుస్తకం విలువను వెలకట్టె అక్షరాలు!

రఘువీర్ రచించిన 'చిగురాశల ఊహలలో' అన్న కవితా సంపుటిని గూర్చి చాలా మంది సాటి కవిమిత్రులు ప్రస్తావించారు. దగాపడిన తెలంగాణ దరహాసం చిందించిన నేపథ్యంలో 'త్యాగాల గడ్డపై తొలి పొద్దు పొడిచింద'ని వట్టిపోయిన వటవృక్షం కొత్త చిగురు తొడిగింద 'ని ఒక కవితలో చక్కగా ఆవిష్కరించారు. అంతేగాక అమరుల త్యాగాల పునాదులపై పురుడు పోసుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలకులు పనిచేయాలని నర్మగర్భంగా ఆకాంక్షించారు రఘువీర్ అంటూ ప్రముఖ కవి, విమర్శకులు దాస్యం సేనాధిపతి పేర్కొ న్నారు. తెలంగాణ అనగానే తేజోమయమైన ఆవేశం కలంలోకి ఉప్పొంగిరావడం అప్పుడు జాలువారిన అక్షరాలలో ప్రాంతభక్తి ఒక శక్తిగా దర్శనమీయటం గమనించవచ్చు.

ఏది చెప్పినా తనదైన ముద్రతో చెప్పే డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజుగారు రఘువీర్ రాసిన ఒక మణిపూసను ఉదాహరించారు.

**'నింగి ముంగిటను ముగ్గులు**
**దూది పింజల్లా మబ్బులు**
**వాన చిలుకల కొరకై**
**ఇవి అవని కన్న కలలు'** వారి వ్యాఖ్యానం చూడండి.. భావం ఎంత సుకుమారమో... దాని వ్యక్తీకణకు ఆయన ఎంచుకున్న పదాలు అంతే మృదులలితం. ఒక్క అభివ్యక్తి వరకే ఈ ధార ఆగిపోలేదు. చక్కని భావ చిత్రం బొమ్మ కడుతుంది. మబ్బులు ఎలా ఉన్నాయి? నింగి ముంగిట ముగ్గుల వలే ఉన్నాయి. ఈ మాట మనల్ని ఒళ్ళు జలదరింపచేస్తుంది. అక్కడితో ఆగకుండా అందంగా తీర్చిదిద్దబడ్డ ఆ ముగ్గులు ఏమిటట? వాన చినుకుల కోసం భూమి కన్న కలలట! ఒక గొప్ప భావ చిత్రం. అలతి అలతి పదాలతో మన ముందు ఉంచాడు రఘువీర్ ప్రతాప్. ఇది కవిత్వంతో పోటా పోటీగా సాగిన డాక్టర్ కాంచనపల్లి వ్యాఖ్యానం!

'ఆలోచనల్లో ఆర్ద్రత, అనుభూతిలో సాంద్రత, అభివ్యక్తిలో నవ్యత పండించుకున్న సుకవి శ్రీ రఘువీర్' అంటూ ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె. జ్యోత్స్నప్రభ గారు ప్రశంసిస్తున్నారు.

రఘువీర్ ముఖ్యమైన పుస్తకాలను చదివి ఈ కవిలో ఆరు లక్షణాలు కనిపిస్తున్నా యంటున్నారు సుప్రసిద్ధ రచయిత్రి సంపాదకులు డాక్టర్ కొండపల్లి నిహారిణి గారు. పర్యావరణ పరిరక్షకుడిగా, రైతు పక్షపాతిగా, రాజకీయ వివేచకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా సమాజ ప్రక్షాలన ఉద్దేశ్యకునిగా, స్త్రీ సమాజ పురోభివృద్ధి కాంక్షించే వాడిగా ప్రతాప్ కనిపిస్తున్నా డంటున్నారు.

రఘువీరును మానవతాకవి అంటున్న తంగిరాల చక్రవర్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి అంటున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సాహిత్య సవ్యసాచి అంటున్న సరికొండ నరసింహారాజు, కవిత్వపు గుల్మోహన్ అంటున్న కళారత్న బిక్కికృష్ణ, స్వభావోక్తులనే వ్యక్తం చేస్తున్నారు.

జీవన సందర్భాలు, షష్టిపూర్తులు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రధానోత్సవాలు వంటివి కవులకు, రచయితలకు వేడుకలకు వేదికలు కల్పిస్తాయి. ఇప్పుడు రఘువీర్ ప్రతాప్ షష్టిపూర్తి సందర్భం. జీవితాన్ని, కవిత్వాన్ని మూల్యాంకనం చేసుకోవడానికి మంచి సందర్భాన్ని కల్పించింది. కవి మిత్రులెందరో రఘువీర్‌తో మమేకమై ఆయన ఉత్సవం తమ ఉత్సవంగా భావించి అక్షర పుష్పగుచ్ఛాలతో స్నేహాభిషేకం చేస్తున్నారు. ఈ మనోహర సందర్భంలో నేను నావైన నాలుగు అక్షరాలను అలంకరి స్తున్నాను. రఘువీర్ నీకు నా హృదయ పూర్వక అభినందనలు.

-డా॥అమ్మంగి వేణుగోపాల్
సెల్:9441054638



## నానీలు

జవజీవాలనూ
శ్రమసారాలనూ
పీల్చే ఆక్టోపస్
ప్రపంచీకరణ
-అనిశెట్టి రజిత

పునాదుల్లేని
భవంతులేనా
ప్రపంచీకరణ
బహుమతులు.
-డా॥కలువకుంట రామకృష్ణ

గ్లోబల్ విలేజ్‌లో
లోకమంతా ఒకటే
మనుషులే..
దూరదూరంగా
-డా॥చిల్లర భవానీదేవి.

తాడు లేకుండానే
ఉరి
అర్థమైందా
గ్లోబలైజేషన్ అంటే ఏమిటో?.
-ఎస్.రఘు

# చారిత్రక విస్ఫోటనం
# కాంచనపల్లి వీరగాథ గేయకావ్యం

డా॥ కాంచనపల్లి రచన “నిరుడు కురిసిన నిప్పు బల్మూరి కొండల రాయుడు” గేయ కావ్యంకు డా॥ గంద్ర లక్ష్మణరావు రాసిన ముందుమాట..

## నానీలు

సంస్కృతి
దిగజారిపోయాకే
ప్రపంచీకరణ
ఊపిరి తీసుకుంటుందా?
-డా॥వై.కృష్ణకుమారి.

ఆవులించక ముందే
పేగుల లెక్క
రిమోట్ చూపుల్తో
వరల్డ్ బ్యాంక్
- డా॥పత్తిపాక మోహన్

“ఏవి తల్లీ నిరుదు కురిసిన హిమ సమూహములు ”అంటూనే ‘ ఝాన్సిలక్ష్మీ దేవి యెక్కిన సైంధవం నేడేది తల్లీ ’ అని గత పౌరుషం లేని కాలాన్ని ప్రశ్నించాడు శ్రీశ్రీ. సరిగ్గా అట్లాంటి గతచరిత్ర లో నివురుగప్పిన నిప్పుల్లా ఉండిపోయిన చారిత్రక వీరగాథలెన్నో ఉన్నాయి. తెలంగాణలో సరిహద్దులు దాటి దేశచరిత్రలో నిలిచిపోయే వీరగాథ ప్రముఖ కవి కలం నుండి వెలువడిన గేయకావ్యం నిరుడు కురిసిన నిప్పు బల్మూరి కొండలరాయడు.

**“ కొండలరాయని పేరుచెప్పితే కొమ్మల పక్షులు కదలగలేవు/ పసి పాపలు పాలుదాగరు/ పశువులుసైతం గడ్డివేయవు/ పులులుసింగములు వణికిపోతయి”** అని మా చిన్నతనంలో వరికల్లాల దగ్గర బుడిగ జంగం వాళ్ళు వచ్చి కథను పాటగా పాడి వినిపించేవారు. కథ పాటరూపంలో కొండలరాయని పౌరుషాన్ని అగ్గిమంటలాగా పాడుతూ చెప్పేవారు. ఇప్పటికీ కొందరుచెప్పేవాళ్ళుండవచ్చు. కాంచనపల్లి కూడా చిన్నప్పుడు ఈ కథ పాటగా వినిఉంటారు. అది మనసు అడుగుపొరల్లో ఎక్కడో దాక్కున్న విత్తనం ఇప్పుడు గొప్పగేయకావ్యంగా బయటకు వచ్చింది.

తెలుగులో గేయాలకు ప్రాచుర్యం వచ్చిన కాలంలో చాలామంది భావగీతాలు రాశారు. డా. సి.నారాయణ రెడ్డి గేయానికి కథాకావ్యరూపాలను ఇచ్చి గేయానికి పట్టంకట్టారు. ఆ తరంలో కొందరు గేయకావ్యాలు రాశారు. వాటిలో చారిత్రకాలే ఎక్కువ. కాంచనపల్లి కూడా ఒక చారిత్రక గాథను అదికూడా ఇప్పుడంతటా వెలుగులోనికి రానికథ. ఈ కథ జగిత్యాల జిల్లా పొలాసలో మొదలై అదే జిల్లాలో మానాల, తరువాత ఆదిలాబాద్‌జిల్లా లోని బెల్లాల,ఎల్లగడప,బాదన్‌పల్లి,క్రమంగా సిరిసిల్ల, ఎలగందల ( కరీంనగర్ ) వరంగల్లు నిజామాబాద్ మొదలైన పలు జిల్లాలకు విస్తరించింది. కాలంసుమారు 18 వ శతాబ్దం. మా చిన్ననాడు బల్మూరి కొండల రావును గురించి పెద్దవారు కూడా కథలుకథలు గా చెప్పుకునేవారు. అయితే అప్పుడు అది స్థానిక విషయం గా అనిపించేది.కాని కాంచన పల్లి అసలుకథనంతా పరిశోధించి తనకు ముందు నవలారూపంలో ఉన్న శ్రీనివాసరాజు, మల యశ్రీల రచనలు త్రివేణి గారి పరిశోధనలు మొదలైనవి అవలోడనంచేసి ఆ కథ ఒక తెలంగాణ వీరయోధుని కథగా, ఒక దేశ భక్తుని కథగా ,ఒక ప్రజానురంజకుని కథగా, ఒక భూస్వామ్య వ్యతిరేక తిరుగబాటు దారుని కథగా , ఒక సాంఘిక సంస్కర్త కథగా మలిచిచూపించారు.






వచనకవిత్వం విరివిగా వస్తున్న ఈ రోజుల్లో గేయకథా కావ్యం ఎందుకు రాయాలనుకున్నాడో కవి తనమాటల్లోనే తెలిపాడు . “ వీరుల కథలు జాతికి స్ఫూర్తి వంతం అవుతాయని,అది గానయోగ్యంగా ఉంటే జనంలోకి మరింత వెడతాయని ఈ ప్రయత్నం చేశాను ” .

కుటుంబ కలహంగా ప్రారంభమైన కథ దేశం పరాయిపాలననుండివిడిపించాలనే స్థాయికి పెరిగింది. అందుకే బల్మూరి కొండలరాయునికథ ప్రజలనాలుకలపై కదలాడుతున్నది.

**కలము నిన్నటి కలలు దాచిన / కనకగర్భం విచ్చుకోదా/ గళము నిన్నటి కళల దలచి/ పరవశమ్మున వాలిపోదా?......** అంటూ కావ్యం ప్రారంభమవుతుంది. కనకగర్భం అనేది కాంచనపల్లి కొత్త ప్రయోగం. రత్నగర్భ అనడం వాడుకలో ఉన్నది.కాని చరిత్రను బంగారు తల్లి అన్నాడు.

**గాలిమనిషికి ఎంతవలయునొ/ లీలనంతే వీచు రోజది/ కనుల చూపులు చెకుముకై మరి/ అగ్నివెలిగించేటి రోజది / .....** కాలసూచనగా తెలిపినపంక్తులే అయినా నాటి చెకుముకి నిజ్ఞాపకం చేస్తూ అగ్గిపెట్టెలు లేని కాలాన్ని, కంటిచూపుతో మండించే పౌరుషాన్ని వ్యక్తం చేశారు.

**కథానాయకుడు కొండలరాయడు.**వెలమ కులం. **కత్తికే ప్రాణములు వచ్చి / కదలిపోయెను పో విచిత్రము......**అన్నట్లుగా కనిపించేవాడు. ఒక పల్లెలో పాటపాడుతున్న ఆమె పాటవిని తానుముగ్ధుడయి కథ పూర్తిగా చెప్పుమన్నాడు. అతడురసోత్సాహమ్మున ఆలకింపనుత్సహింప ... ఆమె గానం చేసినట్లుగా కావ్య కథ మొదలవుతుంది. కథానాయకుని వీరస్వభావం పరిచయం చేశాడు. పాటరూపంలో ఆమెవినిపించిందన్నాడు. అందుకే పాటగానే రాయాలనుకున్నాడు కవి. రసోత్సాహముఅనే పదం ప్రయోగిం చాడు.అంటే కథ కేవలం పొడి చరిత్ర కాదు. రసవత్తరమైన కథ అని పాఠకులకు సూచన. వీరరసం అడుగడుగునా కనిపిస్తుంది. అక్కడక్కడ శృంగారం సన్నని రేఖలాగా కనిపించీ కనిపించనట్లు. కరుణరసం మన మనసులను కదిలించే విధంగా చెప్పాడు కవి. కావ్య లక్షణాలు తెలిసిన కవి మాత్రమే ఇటువటి ప్రారంభం చేస్తాడు.

**తెలుగులో గేయాలకు ప్రాచుర్యం వచ్చిన కాలంలో చాలామంది భావగీ తాలు రాశారు. డా. సి.నారాయణ రెడ్డి గేయానికి కథాకావ్యరూపాలను ఇచ్చి గేయానికి పట్టంకట్టారు. ఆ తరంలో కొందరు గేయకావ్యాలు రాశారు.**

కథ ఏకబిగిన విభజనలు లేకుండా సాగుతుంది. త్రిశ్ర,చతురశ్ర, మిశ్ర,మొదలైన గేయ గతుల మాదిరి ఆయా సందర్భాలను బట్టి లయలను , భాషను, శైలిని బట్టి పాఠకుడిని ఊపిరాడకుండా ఉత్కంఠతో చదివించే గేయ కావ్యం.

పొలాస ఒక చారిత్రక క్షేత్రం. స్థలం. పొలవాస రాజ్యము అని పొలవాస రాజులు అని చారిత్రాకాధారాలు శాసనాలున్నాయి.అది పొలాస పదియూరుల / కేలికలకు నిలయము..... అని పరిచయం చేస్తాడు కవి. అక్కడ జువ్వాడి మాధవరాయలు వెలమ కుటుంబం అరువయి గ్రామాల పాలన సాగుతున్నది. ఆయనకు ఇద్దరు కొడుకులు. వారు పండితపుత్రులు అని ఒక నుడికారం ప్రయోగించాడు కవి. అంటే పరమశుంఠలు అని. వీరికన్న ముందుఒక ఆడపిల్ల .పేరు ధర్మాంబ. ఆమె మణిచ్ఛవినిర్మల హృదయిని అని ఆమె పరిచయాన్ని ఉదాత్తంగా చేశారు. ఆమెకు భర్త రఘుపతిరాయుడు .ఆయ నది బల్మూరి కుటుంబం. ఆయనను ఇల్లరికం తెచ్చుకొని తనకొడుకులను తీర్చిదిద్దుతూ ఈ పొలాస రాజ్యమును పాలించుమన్నాడు. ఆయన పాలన సవ్యంగా సాగుచుండగా ఎదిగిన మాధవరాయలుకొడుకులు దుందుడుకు తనాలు చేయ డం ప్రజలకు కంటగింపు కావడం చూసి నచ్చజెప్పాడు. వారు ఎదురు తిరిగారు. మా ఏలుబడిలో ఉన్న మానాలకు వెళ్ళి బ్రతుకుపో ఇక్కడ మాదే అధికారం అన్నారు.చంద్రమ రాజుఅనే గురువు భట్రాజు సలహాతో ఆశీస్సులతో ధర్మాంబ భర్త రఘుపతిరాయనితో మానాలకు వచ్చి చేరినారు.కోట బురుజులు కట్టుకున్నారు.ఢిల్లీ పాదుషాదగ్గరకు వెళ్ళి తనకుఅధికారం ఇచ్చినట్లుగా ఫర్మానా తెచ్చుకున్నాడు. సంతానం కోసం కోనరావుపేట దగ్గర ఆంజనేయునికి మొక్కుకున్నారు. అక్కడ పరిచయమైన పెద్ద గొల్ల కొడుకు చాగమల్లు పిల్లవాడిని చూసి ముచ్చటపడి ధర్మాంబ వారినడిగి తనవెంట తెచ్చుకొని కొడుకువలె పెంచింది. తనకు కొడుకు పుట్టాడు. అతడేకొండలరాయడు. చాగమల్లు పెద్దకొడు కులా అందరిముందర కనిపించాడు.అతనిపై ఈర్ష్యతో పొలాసలోని బావమరదులుఒక సాకు పెట్టి చాగమల్లును పంపించారు. తరువాత కొండలరాయడు ఎదగకముందే బావమరదులు కుట్రపన్ని రఘుపతి రాయలను చంపివేశారు. ధర్మాంబ పిల్లలను వెంటపెట్టుకొని ఆదిలాబాదుజిల్లా గోదావరి కవతలి ఒడ్డున ఉన్న ఎల్లగడప చేరింది. అక్కడ పాలకుడు జిల్దేరుసాబు. అతడు ఆశ్రయమిచ్చాడు. అక్కడ కొండల రాయడు పెరిగాడు.సాముగరిడీలు,చదువులు నేర్చుకున్నాడు. ఒక పల్లెటూరి పిల్ల చెపుతుండగా తన పూర్వపు కథ విన్నాడు. ఆ ప్రాంతంలో ఉండేఒక యోగి అతడిని పిలిచి వీరకంకణం కట్టి నాటి తెలంగాణ దుఃఖము, దేశపుబానిసత్వము మొదలైనవి తెలిపాడు. గోదావరిమధ్యలో ఉన్న ఒక ఇసుపకోటను రహస్యప్రదేశంగా , చంద్రకళ అనే యువతి నాగవేణిగా నీ వెంట ఉంటుందని చెప్పాడు. కోనరావుపేటలో చాగమల్లు తో కలిశాడు. తిరిగి మానాలకు చేరుకున్నారు. ఆ ఊరిదగ్గర ఆరవెల్లి గ్రామం ఉంది. అక్కడ ఒక నాయకురాలు మాయలు మంత్రాలు తెలిసినది ఉన్నది. ఆమె ను ఎదిరించాడు. ఆమె చేసిన మాయలకు భయపడలేదు. ఆమెను నేలలోకి తొక్కివేశాడు. ( ఇప్పటికీ ఆరవెల్లి నాయకురాలు గుడి ఉన్నది. అందులో నాయకురాలు భూమి లోపలికి మెట్లు దిగి చూడాలి. ) అక్కడనుండి క్రమంగా వీరఖడ్గం చేబూనిన కొండల రాయడు తన ప్రాంతంలోనే కాదు తెలంగాణమంతటా వీరుడుగా చలామణి అయినాడు. అప్పటి సర్వాయి పాపన్నను దారిలో కలుసుకొని ఇద్దరూ అప్పటి పాదుషాలమీద ఎదురుతిరగాలని నిర్ణయించారు. ఆంజనేయుడు కొలువైన గుట్టపై కోటకట్టాలనుకున్నాడు. ఆంజనేయుని సేవించుకున్నాడు. ఆయన వరం వల్లనే ఈయన జన్మించాడని .కొండలరాయనికి ఒక చిన్న తోక ఉండేదని గ్రామస్థులు చెపుతుంటారు. ( అది నిజమో కాదో అని కాంచనపల్లి పేర్కొనలేదు ) కొండలరాయడు ఎలగందుల పాలకులను ఎదిరించాడు. గోలకొండ , ఢిల్లీ పాదుషాలను ఎదిరించే ప్రయత్నాలు చేశాడు. తనవారు కాదన్నా తమ కులం కాదన్నా తన వెంట ఉన్న నాగవేణిని పెళ్ళి చేసుకున్నాడు.అన్ని గ్రామాలలో మత సామరస్యం, కులవివక్ష లేని మంచి మానవత్వం నెలకొనేలా చేశాడు. చివరికి అనేక మంది శత్రువుల దాడిని ఎదిరించి కామారెడ్డి ప్రాంతంలో దొంగలవలె వచ్చిపడిన శత్రువులకు ఒంటరిగా దొరికిపోయాడు. కాని తప్పించుకొని ఆ ప్రాంతపు కొండలు కోనలలో తిరిగి ఒక చోట పరాయి వారి చేతిలో చావకూడదని తనకు తానే ఆత్మార్పణం చేసుకున్నాడు.” ఇది స్థూలంగా కథ.

కాంచన పల్లి ఈ కథలో అడుగడుగున అద్భుతమైన రసావేశపూరితమైన గేయాలను రాశాడు.

రఘుపతిరాయలు పొలాసవీడిపోతున్నప్పటి వర్ణన చదివితే కరుణరసం జాలువారుతుంది. “ **నారాగధనులార! నాశ్రేయ విదులార!**

**నా ఊపిరిని ఊపిరిగ నిలుచు జనులార! ,సెలవుసోదరభావ / దివ్య సంజీవులకు / సెలవు అనురాగ తుహినానంద శీధులకు.. ప్రజలతో సెలవుతీసుకున్న రఘుపతిరాయని** స్థితిని ఆర్ద్రమైన పోలికతో వర్ణించాడు కవి . “ **అతడు కదిలెను సతితో / గొంతువీడిన గాయ/ కుని శోకమన్నటుల....** అని .

కథను ఒక కావ్యంగా మలచడానికి అనేక వర్ణనలు, పాత్రపోషణలు, సంభాషణలు, దృశ్యాలు చిత్రీకరించారు కాంచనపల్లి. ఉదయ సాయంత్రాలు, అడవి, నది, కొండ మొదలైన అనేక దృశ్యాల వర్ణనలు భావసాంద్రతతో పెనవేసుకొని నడిచాయి. “ **ఉదయకాలంబదొ ముదముగా నరుదెంచె/ ఆకుపచ్చని అశ్వతతి సప్తమై నడిచె / ఆకాశవనములో తూరుపు చెట్టుపై/ ఎర్రమందారమ్ము నేతెంచె తిన్నగా......** ఈ వర్ణనలో కొత్తదనమున్నది. ఆకుపచ్చని గుర్రాలు సూర్యునివి అవి సప్తాశ్వములు అని ధ్వనించాడు. తూరుపు కొండ అనడం సహజం కాని తూరుపు చెట్టు అని కొత్త భావన. ఇట్లా ఈ గేయం ఖండగతిలో సాగుతుంది. కథాసన్నివేశ సందర్భంతో పాటు కావ్యవర్ణనానందాన్ని పాఠకునికి అందించారు. సాయంకాల వర్ణన చూడండి. “ **పశ్చిమాద్రి భాను/ దట గ్రుంక రక్తోర్వి/ పైన ఆకాశము / పరచినట్టుగ తోచె,, శబ్దనైరూక్ష్య ఝం/ ఝిత ధనుష్టంకార/ మదొమేఘ గర్జాట్ట/ హాసమ్ముగా దోచె........** ఇట్లా సాగుతుంది. సమాసఘటన సందర్భానికి తగినట్లుగా ప్రయోగించారు. శబ్దనైరూక్ష్య .... అనడం కాంచనపల్లి పాండిత్యాన్ని పట్టి ఇస్తున్నది. శబ్దానికి అర్థం వివరించేది నిరుక్తం. నిరుక్త సంబంధమైనది నైరూక్త్యం. శబ్దానికి అర్థం అని ఒకవిధంగా, శబ్దం అంటే ధ్వని అని మరోవిధంగా శ్లేషను ఆర్భాట స్థితిని ఈ గంభీర సమాసాలలో ప్రకటించడం సందర్భోచిత ప్రయోగం.

ఉపమానాలలో పలు సందర్భాలలో కవి,కవిత్వ ప్రస్తావన సూచనగా చేయడం ఈ కావ్యంలో కనిపిస్తుంది.

**ఏజన్మన రసగంటము/ నేను కనుల కద్దినానొ/ ఈ జన్మన నీకు కొడుకు/ గాను చలామణి అయితిని.....** ఇందులో పూర్వజన్మలో రసగంటము పట్టిన కవి అని సూచన.

కథలో అవకాశం కల్పించి తెలంగాణ గురించి విపులమైన గేయఖండాన్ని రాశారు. సుమారు అయిదు పేజీలు గా సాగింది.

**శాతవాహనులేలు ఖ్యాతిగాంచిన నేల/ బౌద్ధమత శాఖలో పరిఢవిల్లిన నేల/ గాథల సప్తశతి ఇగురించుకొనునేల/....**

ఈ క్రమంలో కాకతీయ రాజులు, సోమన పోతన వంటి కవులు శిల్పులు వీరులు మొదలైన వారందరినీ స్మరించారు.

**తెలుగు తెలగాణమ్ము వెలవెలై పోనేల/ ఇన్ని రాజ్యాలుగా ఇటవీడిపోనేల/ జాతినంతయు ఏకఛ్ఛత్రమ్మునకు దెచ్చి/ ప్రజల ఆకాంక్షలకు ప్రాణమిచ్చే జాదు/......** అంటూ ఒక పూర్వచారిత్రకపౌరుషాన్ని రగుల్కొలిపే కథలా నడుస్తుంది.

తెలంగాణ విమోచనం, జాతీయ స్వాతంత్ర్య పోరాటం నాటి సన్నివేశాలను ఇది మన కనులముందుంచుతుంది.

**ఏలా ఈ తెలంగాణము నిట్టుల/ బానిస దేశముగాన బరగవలె/ ఏలా ఈ పరకీయపు రాజులు/ ఈగతి మనలను ఏలుచుండవలె/ .....** నాడుకూడా తెలంగాణలో ఈ పోరాట పటిమ కొనసాగింది. ఇది నిజాం విమోచనోద్యమం కంటే సుమారు వందేళ్ళు ముందు.

యుద్ధానికి సన్నద్ధమవుతున్న సందర్భంలో గేయగతిని పదాల వడిని ప్రయోగించిన తీరు విశేషం.

**ఎత్తర ఎలుగెత్తర శిరసెత్తర శివమెత్తర / తత్తరమును వీడి నీవు తగ అడుగులు వేయరా/ ముత్తియాలు కడుపు దాచు మురిపమైన నేలరా/ తంగెడు పూలవనము రంగు మారవట్టెరా......** మొదటి చరణాలలో ఒక ఉత్సాహం, తరువాత చరణాలలో ఆ ఉత్సాహానికి ప్రేరణనిచ్చే నేటి దైన్యము వెంటవెంట నడిపించిన పంక్తులు. ఇందులో ముత్యాలకు ప్రసిద్ధి మన భాగ్యనగరము, బతుకమ్మకు ప్రధానమైనది తంగేడు పూవు . పదాలలో లోతైన అర్థాలను, సూచనలు, ధ్వనిని ప్రయోగిస్తూ కావ్యం నడిచింది. బిగి సడలని విధంగా గేయాలు కదిలాయి.

**ధమ ధమ ధమ ధమ ధమ ధమద్ధమ తళాంగు తళాంగు తరథిమి తోంధిక మ్రోగెను వాద్యము సాగెను నటన..** అని గ్రామంలో జరుగుతున్న ఒక నాటక దృశ్యాన్ని చూపించారు. ఇందులో సంగీత తాళలయాదుల వ్రోతలు వినిపించారు.

మరోచోట...వణికిరి రాజులుజ మీందారులు/ వణికిరి భూస్వాములు పెద్దలు/ దినకరుడై నవ దిశాచరుడై/ ఆగమ సూర్యోద మూలుండై/ విజృంభించె మన కొండలరాయడు/ విదిత ధర్మ పరిపాలన జేయుచు/...... ఇది చతురస్రగతిలో నడిచిన గేయం. కొండలరాయడు కేవలం పరాక్రమశాలియే కాదు, దుష్టులైన రాజులు, జీమీందారులు భూస్వాములుకూడా భయపడ్డారు. అది ఆయన ప్రజాక్షేమ కాంక్ష. అని తెలియజేయడం ఆనాడే తెలంగాణలో తిరుగుబాటు, అభ్యుదయం వంటి భావాలకు బీజాలున్నాయని కవి వ్యంజింపజేశాడు.

కులం కాని అమ్మాయిని పెళ్ళి ఎట్లా చేసుకుంటావని అడిగినప్పుడు “ **ఈ కుల వాదమ్ము నెట్లు సహింతును / ప్రణయ బంధము ఫణముగా నెట్లు సేతును?** అని కులవాదాలు కూడవు అనే సందేశాన్ని తెలిపిన గేయచరణాలున్నాయి.

సంభాషణరూపంలో నడిచిన గేయం కూడా ప్రయోగించాడు.

ఆమె : దొంగలుందురు ముందు ముందర?
అతడు :వారు ననుగని పారిపోదురు
ఆమె: పాములుండును పడగవిప్పును
అతడు : ఆయవి మాకు అలంకృతములు

ఇట్లా గేయంలో సంభాషణ చమత్కారం గాను నాటకీయంగాను అలరిస్తుంది. ఇంకోచోట “ అమ్మయెట్లున్నది/ అన్నలెటున్నరు? అని గేయంలోనే కుశలప్రశ్నలు మాట్లాడే భాషలోనే అందంగా ఒదిగించారు.

కొండలరాయడు దసరా పండుగ రోజున తన తండ్రి వీరఖడ్గము నెత్తిన తీరు.... “ శివధనుస్సు విరిచినట్టి/ శ్రీరఘువీరుని పోలిక/ ఖడ్గానికి మ్రొక్కి దాని / నవలీలగ నెత్తినాడు/ .పోలిక తానే చెప్పినాడు.ఇందులో రఘువీరుడు రామాయణంలోని రాముడు, కొండలరాయని తండ్రి రఘుపతి రాయడు, అని కథానుసారంగా సాగిన ధ్వని. ఇట్లాంటి కావ్యసంప్రదాయలక్షణాలు గల వర్ణనలు, పదబంధాలు, శ్లేషాది అలంకారాలు, శబ్దాలంకారాలు, అనేకం ఈ కావ్యంలో చూపించారు కాంచనపల్లి.

**పొలాస ఒక చారిత్రక క్షేత్రం. స్థలం. పొలవాస రాజ్యము అని పొలవాస రాజులు అని చారిత్రాకాధారాలు శాసనాలున్నాయి.అది పొలాస పదియూరుల / కేలికలకు నిలయము..... అని పరిచయం చేస్తాడు కవి**

గేయాలు మాత్రమే కాక ఆయా సందర్భాలలో రకరకాల ఛందస్సులలో పద్యాలుకూర్చాడు. మత్తకోకిల , కవిరాజ విరాజితం, పంచచామరం , వంటి విశేష వృత్తాలు అలవోకగా సాగాయి. దేశిచ్ఛందములోని సీసపద్యాలు, తురగవల్గన రగడ, వంటివి తగినచోట తగినవిధంగా రాశారు.

నిలింప రమ్య భావనా వినీల శ్వేతధామమై/ చలింప తారహారముల్ విజర్జితాభి తేజమై

ఫలింప చంద్రచంద్రికల్ శుభాల క్షీర ధారలై/ జ్వలించు ఖడ్గ దంష్ట్రలన్ నిశాత శౌర్య పానమై.......... ఇది పంచచామరము. జగణ, రగణాలతో గుర్రం డెక్కల చప్పుడు మాదిరిగా నడిచే లయ ఉంటుంది. దీన్ని కాంచనపల్లి ప్రయోగించడం ఆయనకున్న ఛందఃపరిజ్ఞానానికి నిదర్శనం.

సొప్పదండు ఒక్కటైతే గొప్పవాడు ఎదిరించగలుగునా, అని ఈతకలు, పచ్చజొన్న రొట్టె, కోడి కూర, బబ్బర్ల గుడాలు, కొతిమీర మిరపచేలు, జొన్నకంకి, దోసపండు,బీర ముద్దబంతి పూలు..... ఇట్లా ఈ ప్రాంతపు ఆకాలపు జీవనశైలిని వదలిపెట్టకుండా చేర్చారు కవి.

తెలంగాణ చరిత్రతో పాటు ఇక్కడి సంస్కృతి, భౌగోళిక వాతావరణం, భాష, ప్రజల జీవనగతులు విడిచిపెట్టకుండా కావ్యంలోఅందంగా బతుకమ్మలాగా పేర్చాడు. గేయాల నడకల భిన్నత్వం, ప్రబంధాల వంటి వర్ణనలు, కావ్యం వలె కథ, పాత్రలు అన్నీ గేయ చారిత్రక వీర గాథా కావ్యంగా సమగ్రతను సంతరించుకున్నది.

కావ్యాంతంలో నిచరణాలు కావ్యానికి లేదా నాటకానికి భరతవాక్యం వలె ఉంటూ కథాసారాంశమంతా మరొకసారి స్మరణకు తెచ్చేదిగా ఉండటం కూడా కావ్యం సంప్రదాయం తెలిసిన కవి మాత్రమే చేయగలడు.

**తెలగాణ రక్తమ్ము న జలజల ప్రవహించునాడు / హిమము జ్వలన శంఖముగా/ సమరశంఖ మూదునాడు.....**

**ఆ కథా క్రమము జాతి / కతుల స్ఫూర్తిని నింపును కద/ అమర వీరు కథా క్రమము నాలకింప ఆర్ద్రము కద...........**

ఈ కథలో ఎంత వీరరసముందో అంత కరుణరసముంది. అని చదువరులు గమనించడానికి కవి సూచన ఇది. సూ చించకపోయినా అనుభవానికి వస్తుంది.

**పూవు వజ్రమ్ము ఏకమై పుట్టునట్టి కొండలుండు బతుకి పేద గుండెలందు.....** అని తేటగీతి పాదాలతో ముగింపులో కొండలు కేవలం వీరవిక్రముడు కాదు, స్వార్థపరుడు కాడు పేదల కోసం బతికినవాడు అనే సందేశాన్నందించారు.

స్పష్టాస్పష్టంగా ఉన్న బల్మూరి కొండలరాయని కథను ఒక చారిత్రక ప్రజాక్షేమ ధీదునిగా వీరునిగా సుస్పష్టం చేశారు కాంచనపల్లిగారు ఈ గేయకావ్యంలో.

ఇంతటి గొప్ప గేయకావ్యాన్ని “ రమణాచారికి/ ప్రతిభా ద్యుమ సంవృత భావ మణికి తులనాత్మునకున్ నమతుల్యత పాటించిన/ క్రమ శాంతికి రసరాగ క్షాళిత మతికిన్... అని షష్ఠ్యంతాల వలె పద్యాలలో డా.కే.వి. రమణాచారి గారికి అంకితమివ్వడం కూడా ఒక ఔచిత్యం.

ఈ గేయ కావ్యానికి తెలంగాణ సారస్వత పరిషత్తు ఉత్తమ గేయ కావ్యంగా పురస్కృతి నందుకోవడం సముచితం. కవితారంగంలో కావ్య రచన లు కొరవడు తున్న ఈ కాలంలో గేయరూపంలో తెలంగాణకు గొప్ప స్ఫూర్తినివ్వగల కావ్యం రాసిన కాంచనపల్లి పండితుడు, కవి, వచన, పద్య, గేయ కవిగా మరోమారు నిరూపించుకున్నారు.



-డా.గంద్ర లక్ష్మణ రావు
9849328036

## 'ఆన్ లైన్'లో...

ఏం కావాలి
ఏది కావాలి
చేతులు సంపాదిస్తే
చూపులు ఖర్చు పెడుతున్నాయి
అరచేతిలో
ఆన్ లైన్ షాపింగ్ అంటువ్యాధి.
మంచిదా ...
చెడ్డదా.... ముఖ్యం కాదు
అవసరం తీరాలి
తర్వాత అక్కరకు రాక
మూలకున్న పర్వాలేదు.
నీ కోసం
ఏదీ తయారు చేయబడదు
నూటికో కోటికో నువ్వు ఒక్కడివి
రుచులు అభిరుచులకు
కొలతలు కోరికలు సరిపోతే చాలు.
మూడో కంటికి కనిపించకుండా
పార్సిల్ కాలింగ్ బెల్ కొడువుతుంది
నచ్చితే ఉంచుకో
నచ్చకపోతే తిప్పి పంపుకో
నూతన విడాకుల ఫార్ములా !.
వేసవి తాపాన్ని తట్టుకోలేని
కొన్ని సంసార పక్షులు
వీలు కల్పించుకొని
ఆఫ్ లైన్ కొనుగోలు ఊత కర్రతో
మాల్స్ నీడన వాకింగ్ చేస్తున్నాయి
ఏ ఒక్కరి సొంతం కాదు
తెలివి
అతి తెలివే కొందరి సొంతం !.
ఎన్నైనా చెప్పు
ప్రేమను ఆత్మీయతను
అనుభూతిని
ఆన్ లైన్‌లో ఆర్డర్ పెట్టి
తెప్పించగలమా!.



-అశోక్ జిందమ్
8978532225

## ఏకాంతం

నిశ్శబ్దం మాటలయ్యే వేళ,
నీడలే తోడుగా నడిచే వేళ,
మనసు తనతో తాను మాట్లాడుకునే
క్షణమే ఏకాంతం.
చీకటిని తొలగించే దీపంలా,
మనలోని అంతర్లీన అంధకారం,
అశక్తతలను పారద్రోలే
మందువంటిది ఏకాంతం.
గత జ్ఞాపకాల తలుపులు తట్టి,
నవ్వుల పువ్వులు పూయించి,
ఆనందబాష్పాలకు
స్థానం ఇచ్చేది ఏకాంతమే.
ఏకాంతం బాధ కాదు
ఒక పాఠశాల
మనకు మనమే గురువులమయ్యే
అంతరంగ స్థలం.
మన కలలు పురుడు పోసుకునే చోటు,
భయాలు కరిగిపోయే క్షణం,
ఆత్మవిశ్వాసం బలపడే
నిశ్శబ్దపు లోకం ఏకాంతం.
ప్రపంచం నుంచి కాదు,
మనలోనికి మనం చేసే
లోతైన ప్రయాణమే ఏకాంతం.
మన నిజ స్వరూపం,
జీవిత పరమార్థం తెలిపేది
ఈ ఏకాంతమే

-డా. ఆవుల రేణుక
9398268976

## మధ్య తరగతి మందహాసం

ఆలోచనలన్ని
కొట్టుకుంటున్నాయి
ఒడ్డున పడ్డ చేపల్లా...
మనసు కునారిల్లుతోంది
వంజరంలో బందీ అయిన
చిలుకల్లా...
నలిగి పోతోంది హృదయం వలలో
చిక్కిన జింకలా...
అనుకున్నవి తీరే దారి దొరకక..
ఊహలు నిజం అయ్యే తావు లేక...
గుండె మారుతోంది ఇస్త్రీ చేయని గుడ్డలా...
సమస్యలు విష వలయంలా చుట్టు ముడుతుంటే...
తీరని బాధ్యతల భారం నెత్తిన
గుదిబండలా మారుతుంటే...
నలిగిపోతున్నా జీవితం
ఆశనిరాశల కత్తెరలో పోకచెక్కలా అవుతుంటే
గంతకు తగ్గ బొంతలా దొరికిన
ఉద్యోగం చేస్తుంటే.. చాలీ చాలని జీతం
నెలంతా భయపెడుతుంటే...
నలిగిపోతున్నా ఆదాయవ్యయాల
వ్యత్యాసం అప్పుల ఊబిలో లాగుతుంటే
నమ్ముకున్న వారికి కడుపు నింపలేని దురవస్థకి
దరిద్రం తుమ్మబంకలా అతుకున్న నా పరిస్థితికి
నలిగిపోతున్నా చిన్న కోరికలు తీర్చలేని నా దుస్థితికి
నలిగిపోతూనేవున్నా అనుక్షణం
జీవితంలో సాధించిందేంటో తెలవక...
వాస్తవావాస్తవాల మధ్య నలిగిపోతూనే వున్నా
మిక్సీలో పచ్చడిలా....కనిపిస్తూనే వున్నా
మధ్యతరగతి మందహాసంలా...

-జి. మధు మురళి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1795వ రోజు **'అద్దం'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'అద్దం'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



***మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం***

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

*-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839*

### నిశ్శబ్ద చంద్రుడు

గోడకు వేలాడే
నిశ్శబ్ద చంద్రుడిలా
మన ముఖాన్ని మాత్రమే కాదు-
మనసులో దాచిన
ముసుగులనూ చూసేస్తుంది.
నవ్వితే నవ్వులను పూయిస్తుంది
ఏడిస్తే నీడలా తడుస్తుంది.
మన మాటలు వినకపోయినా
మన మౌనాన్ని
అర్థం చేసుకుంటుంది.
కాలం వేసిన ముడతలను
నిజంగానే చూపిస్తుంది.
కానీ హృదయంలోని గాయాలను
మాత్రం
మౌనంగా దాచిపెడుతుంది.
అద్దం ఎప్పుడూ అబద్ధం చెప్పదు
అందుకే కొన్నిసార్లు
మనిషికి తనకన్నా
అద్దాన్ని చూస్తేనే
ఎక్కువ భయం.
ముఖం మీద ఉన్న ధూళిని
తుడిచేయమని చెబుతుంది.
మనసుపై పేరుకున్న
అహంకారాన్ని కూడా
శుభ్రం చేసుకోమని గుర్తు చేస్తుంది..
అదొక వస్తువు కాదు-
మన జీవితానికి ఎదురుగా నిలిచే
నిజం అనే గురువు.
ఉదయ తొలి కిరణం
తనపై పడగానే
బంగారు సరస్సులా మెరుస్తుంది.
దాని ముందుకు వచ్చే ప్రతి మనిషి
తన కథను కాసేపు
అక్కడ వదిలి వెళ్తాడు?
కొంతమంది
ఆశలను దిద్దుకుంటారు
మరి కొంతమంది
కన్నీళ్లను దాచుకుంటారు..
పగిలిన అద్దం ముక్కల్లో కూడా
మన రూపమే కనిపిస్తుంది
విరిగిన జీవితంలోనూ
ఆశా ప్రతిబింబం
మిగిలే ఉంటుంది..
అద్దం ఎవరినీ ఆపదు
ఎవరినీ వెంబడించదు.
కానీ ప్రతి రోజూ
"నువ్వు నిన్నటి కంటే మారావా?"
అని మౌనంగా ప్రశ్నిస్తుంది..
చీకటి గదిలో అది
సాధారణ గాజులా కనిపించినా
ఒక చిన్న వెలుగు తాకితే చాలు
వెయ్యి కాంతులను
తిరిగి పంపిస్తుంది.
మనిషి హృదయం కూడా
అలాంటిదే కదా!.

**-శ్రీలతరమేశ్ గోస్కుల**

### అందరికీ చుట్టమే

నిజాన్ని నిర్భయంగా
చూపినీచే అద్దం
అందరికీ చుట్టమే.
కదలని మెదలని అద్దం
కట్టి పడేస్తుంది అందరినీ
అందం దిద్దుకోవడానికి
అంతరంగమే పరుస్తోంది
ముందర.
అక్కడ ఇక్కడ అంటూ ఏమీలేదు
బాత్రూం నుండి షాపింగ్ మాల్ వరకు
తానుండని ప్రదేశమేదీ లేదు
పొద్దున లేచింది మొదలు
పడుకునే వరకు
దాని మొఖంలో
మొఖంచూసుకోంది
పూట గడవదు.
అందరి రూపురేఖలు
చూపించే అద్దం
నూలు పోగైన చుట్టుకోదు
ఒంటికి
తన అంతరంగనీలో ఏముందో
తెలువదుఎవరికి
ఉన్నది ఉన్నట్లు చూపించడమే
తన వృత్తి.
కోపం వచ్చే తాపమొచ్చే చేజారో
కిందపడి ముక్కలైనా
తన మనసు మారదు
అబద్ధం చూపించదు
నిజాన్ని నిర్భయంగా చెప్పే
ఆత్మసాక్షి అద్దం.
ఎవరి నీడ వాళ్ళను
తప్పు దారి పట్టిస్తుంది
పొద్దు మారిన కొద్ది
నీడ బుద్ధి మారుతుంది
రూపు రేఖలను
మార్చి చూపిస్తుంది.
నీడ అబద్ధం
అద్దం నిజం
ఇది అందరూ ఎరిగిన సత్యం.

**-పొన్నాల ధనమ్మ**

### పగిలిన ప్రతిబింబం.

గోడకు వేలాడే గాజు చత్రమై
ముఖంపై ముసుగుల్ని
తొలగించే వస్తువై
పైకిచెప్పలేని
బాధలకు ప్రతిబింబమై
కళ్లలో ఇంకిన
కన్నీటికి రూపమై
అబద్ధాన్నికూడా ని
బద్ధతతో చూపించే
నిజం పేరు అద్దం.
సమాజమూ ఒక అద్దమే
దాని వెనుక ఉన్న
వంచనల పూత.
ముందు మెరుపు
వెనుక విరుపు.
మాటల్లో మమకారం
మనసుల్లో అసూయాజాలం.
పేదవాడి చెమట చుక్కను
ముత్యమని ఒప్పుకోని మోసం
ధనవంతుని నీడకే
దైవత్వపు రంగులు పూసే వంచన.
గుండె పొరల్లో ఉప్పొంగిన వేదన
చెంపపై కన్నీటి రేఖగా జారితే
దాన్ని మనసు గాయం అనకుండా
బలహీనత అనే ముద్ర వేస్తుంది.
ఆడపిల్ల కళ్లలో
అందమైన రేపటిని చూపకుండా
పీడల నీడలనే చూపుతుంది.
వాన కోసం
ఆకాశాన్ని చూసే రైతుకి
మేఘాల ఆశలను కాక
ఎండిపోయిన
పంట పగుళ్లనే చూపుతుంది.
దినసరి కూలీ
అరచేతి గాయాలను
జీవిత యుద్ధపు
పతకాలుగా పరిగణించకుండా
అలవాటైపోయిన అరుగుదలగా
మభ్యపెడుతుంది.
ఆత్మ ముందు నిలబడటానికి
నువ్వు సిద్ధమైన క్షణంలో
సమాజ అద్దం ముందు
నిలబడటం
ఒక యుద్ధ రంగంలా
అనిపిస్తుంది.
ఎంత సుగంధం చల్లుకున్నా
అశుద్ధానికి సువాసన రానట్టే
ఎంత నవ్వు ముసుగు ధరించినా
దాచిన రహస్యాల గదులను
ఈ సమాజం శోధిస్తూనే ఉంటుంది.
సూర్యుడు పసిడి పత్రంలా
పడమట ముడుచుకున్న వేళ
మనిషి లోపల
అమావాస్య ఆవహిస్తుంది.
రాత్రి ఒంటరిగా పడుకొని
మనల్ని మనమే
తరచి చూసుకొన్న క్షణం
అది ఆత్మవిచారణ సభలా
అనిపిస్తుంది.
అప్పుడు ఎప్పుడూ
ఒక ప్రశ్న ఉదయిస్తుంది!.
"నువ్వు బతికేది జీవితమా?
లేక సమాజం కోసం నటనా?"
దానికి సమాధానం మౌనమే.
కాలం ఆఖరి కీర్తన ఆలపించే వేళ
జ్ఞాపకాల తుట్టె రేగిన అలజడికి
కనురెప్పలతో క్షమాపణలు
అడుగుతూ
నిజం ఎదుట నిలవలేక
మనసు అద్దంలా పగిలిపోతుంది
ఆ ముక్కల్లో ప్రతిబింబమయ్యేది
ఛిన్నాభిన్నమైన మనిషితనం.

**-నాగరాజు చుండూరి**

### నిజానికి నిర్వచనం

నిజాలను నిర్భయంగా
నీ ముందు నిలుపుతుంది
కుడి ఎడమలవుతుందేమో
కానీ తలకిందులు కాలేదు.
ఎప్పుడూ అందంగా చూపెడుతూ
ఆనందాలను మూటకట్టినా
యదార్థవాది లోకవిరోధిలా
అప్పుడప్పుడు బాగోలేనప్పుడు
చూపిన బింబం
సంతోషపెట్టలేదు.
కొండ అద్దమందు
కొంచమై నిలవదా
ఆలుమగల కొట్లాట
అద్దం మీద పెసరగింజలా
తెలుగు సామెతలకు
తేటగా సకారాత్మకం.
పుట్టింది పుణ్యచరితగా
ఈజిప్ట్ లోనైనా
ఇంటింటా ఓ అత్యవసరమై
నాగరికతకు తోడైంది.
ఎన్నో వస్తువులను ఏమార్చిన
తెరలవాణి
ఇప్పుడు
అద్దాన్ని కూడా మింగేసి
త్రేన్పు తీసి
తమాషా చూస్తున్నది
సెల్ఫీ మోడులో చూపిస్తూ.

**-నగునూరి రాజన్న**

### ఎదబింబం

మనిషికి మనసే అద్దం
ఆలోచనలకు ప్రతి రూపం
మంచితనానికి తెల్లగా
తళతళ మెరిసే దర్పణం!!.
సుభద్ర మనోగతాన్ని తెలిపిన
ప్రియదర్శిని ముకురం!!.
దుర్మార్గపు దుమ్ము ధూళి
పడనంతసేపు
చెడు ఆలోచనలు
చుట్టుముట్టనంత సేపు
తెల్లని వినీలాకాశమే!!.
కోపాల సెగలకు మబ్బులు కమ్మి
మసి పూసిన నల్లని రంగుతో
మసకబారి
కనిపించని ఎదబింబం!!.
విరిగే బంధాలకు
ముక్కలైన దర్పణం
ప్రతిముక్క నవ్వుతూ వెక్కిరిస్తుంది
ఒకే మనసు
ఇన్ని రూపాలెత్తిందని!!.
మంచితనమే మంచి దర్పణం
అందరికీ కనిపించే
నీ ఎదబింబం!!.
ప్రేమామృతాన్ని పంచుతూ
మానవత్వాన్ని పెంచుతూ
పరిశుభ్రంగా ఉంచుతూ
స్వచ్ఛమైన ఆలోచనలతో
దుమ్ముధూళి సోకకుండా
మనోదర్పణాన్ని విరగకుండా
పగులకుండా రక్షించుకుందాం!!.

**-డా. చీదెళ్ళ సీతాలక్ష్మి**

### మనసుకూ అద్దం ఉంటే బాగుండు

అద్దంలో మన ప్రతిబింబం
మనమెలా ఉన్నామో చూపిస్తుంది
నలుపూ తెలుపూ
సంతోషమూ కోపమూ
విచారమూ
రూప విశేషాలతో పాటు
భావోద్వేగ తరంగాలకూ చిత్రిక
ఒక్కోసారి మనసు విచారాన్ని
అందరి ఎదుటా కప్పిపుచ్చుకొని
సంతోషంగా ఉన్నట్లు
నటించవలసి వస్తుంది
అమ్మానాన్నలే
మంచి ఉదాహరణ
తమకెన్ని సమస్యలున్నా
పిల్లలకు
తెలియకుండా పెంచుతారు
సుఖ సంతోషాలే గానీ
కష్టం అనుభవంలోకి రానివ్వరు
ఓట్లడిగేందుకు వచ్చిన
రాజకీయ నాయకులు
పైకి వినయంగా
దండాలు పెట్టి ఓట్లడిగినా
మనసులో
తిట్టుకుంటూ ఉంటారు
నా ఓటు మీకే అని ఓటరు
నమ్మకంగా హామీలిచ్చినట్లు
కనబడినా
ఓటరూ మనసులో
తిట్టుకుంటూనే ఉంటాడు
అద్దం చాలావరకు
నిజాలు చెప్పినా
మనసులోని కొన్ని విషయాలు
దాస్తుంది
అందుకే మనసుకూ
అద్దం ఉంటే బాగుండు
ప్రేమించాలని వెంటబడే
మగవాడి మనసులో
ఏముందో తెలుస్తుంది
సమాజంలోని వ్యక్తుల మధ్య
ఒకరిమీద ఒకరికి ఎంతటి
అసూయాద్వేషాలున్నాయో
తెలుస్తుంది.

**-నాగిరెడ్డి అరుణజ్యోతి**

### నిజానికి సాక్ష్యం!

అందనివాడైనా
నింగిలోని చందమామను
అందిస్తుంది
అరచేతికి అందంగా
నిండు జాబిలితో
కబుర్లు చెప్పిస్తుంది
ఊహల ఊయలలో
ఊపేస్తుంది
చల్లని వెన్నెల ఒడిలో
హాయిగా
స్వచ్ఛమైన పసి మనసులకు
లాలి జోలపాటలు పాడుతుంది..
కష్టాల్లో నీ తోడవుతుంది
గుండెల నిండా ధైర్యం చెబుతూ
భాగస్వామి అవుతుంది
నిర్మలమైన మనస్సుతో
భ్రమలను కడిగేస్తూ
నిజాలను
నిర్భయంగా నొక్కి చెబుతుంది
తప్పులను వేలెత్తి చూపెడుతుంది
సంస్కార ఔన్నత్యాన్ని
చాటి చెప్పుతుంది..
మోస ద్వేషాల
నీ ప్రతిబింబాన్ని
చూపెడుతుంది అసహ్యంగా
కోపం తాపం
గుండెకు గాయం చేస్తుందని
అద్దంలా పగిలిన మనసు
మళ్ళీ అతకదని శాంతమే ముద్దని
సహనమే హద్దని
చెక్కిలిపై ముద్దిడుతుంది
ప్రశాంత చిత్తంతో
అడుగులు వేయిస్తుంది
నీకేది అసాధ్యం కాదని
విజ్ఞతను నేర్పిస్తుంది ..

**-పి.పద్మావతి**



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం కథల వర్క్ షాప్‌లో శ్రీనివాస శాస్త్రి కథ చదవండి.

-సంపాదకులు

## నీటి కావడి

కథ

"ఎన్ని ప్రభుత్వాలు మారినా మనకి మాత్రం ప్రతి వేసవి లో ఈ నీటి తిప్పలు తప్పడం లేద ంరా అబ్బాయ్" అన్నాడు రం గయ్య.

"మరే, బాబాయ్. వేసవికంటే ఎంతో ముందుగానే ఊళ్ళో బావులు, బోర్లు అన్నీ ఎండిపోవ డం , ఎర్రటి ఎండల్లో నీళ్ళ కోసం ఊరికి మైలు దూరం లో ఉన్న ఈ పెద్ద బావికి రావడం మనకు తప్పడం లేదు" అన్నాడు రోశయ్య..

"అవునూ, రోడ్లు తవ్వి గొట్టా లు ఏవో వేస్తున్నారు.. అవేమిటో తెలుసా' అడిగాడు రంగయ్య.

"అవును బాబాయ్.. మన ఊరి బయట చెరువు తవ్వించి, అక్కడ నుండి పైపుల ద్వారా ఏడాది పొడుగునా ఇళ్ళ వద్దకే నీరు సరఫరా చేస్తారట". అన్నాడు రోశయ్య.

" అయితే త్వరలో ఊరి జనా లకు ఈ నీళ్ళబాధ తీర బోతు న్నది' అంటూ సంతోషించాడు రంగయ్య..

"చూద్దాం బాబాయ్ గవర్న మెంట్ పనులాయే, అవి ఎప్పటికి పూర్తి అయ్యేనో. ఇప్పటికయితే కడవ ఎత్తుకో అని పెద్దా యనకు కడవ భుజానికి ఎత్తుకోవడానికి సాయం చేసి, తన నీళ్ళ కావడిని భుజాన వేసుకున్నాడు రోశయ్య.

.....

"పెదనాన్నా! వేము వేసవి సెలవులకు

అమ్మమ్మ గారి ఊరు వెళ్ళేప్ప టికీ స్కూల్ దారిలో తుమ్మ చెట్లు ఉండేవి.. రెండు నెలల్లో చెట్లన్నీ కొట్టేసి చుట్టూ మట్టితో కట్ట పోసి ఉంది.. ఇప్పుడు ఈ ఊరి ముఖచిత్రమే మారిపోయింది" అన్నాడు శ్రీను..

"అవును! నెదర్లాండ్స్ వారు బాగా నీటి ఎద్దడి ఉన్న కొన్ని గ్రామాలను దత్తత తీసుకొ న్నారట.. మన గ్రామం లో కూడా చెరువును త్రవ్వించారు. నిధుల కొరత లేదు కనుక పనులు చాలా వేగంగా చేస్తున్నారు" ఆనందం తో చెప్పారు వెంకట్రామయ్య గారు..

"అయితే ఇకనుండి మా స్నేహితులు సుబ్బారావు, హను మంతులకు రోజూ స్కూలు వదల గానే నీళ్ళ కడవలు మోసే పని లేదు .

వాళ్ళు కూడా సాయంత్రం మాతో కలిసి ట్యూషన్ కి వస్తారు. కలిసి చదువు కుం టాం! అని ఆనందించాడు శ్రీను...

...

ఒక ఏడాది గడిచింది. మళ్ళీ బావి దగ్గర కలిసారు బాబాయ్, అబ్బాయ్. ఇళ్ల దగ్గరకే నీళ్లు వస్తున్నాయి అనే సంతోషం ఒక సంవత్సరం లోనే ఆవిరై పోయింది. నేనుకూడా పనికి వెళ్ళి, కోడలి చేతిలో కొంత డబ్బును పెట్టేవాడిని. అత్తమ్మ కు మందుల ఖర్చులు పోగా అంద రం ఒక పూటైనా కూర మెతుకులు తింటున్నాం మామ య్యా" అని కోడలు అంటుంటే ఎంతో సంతోషించా" బాధతో అన్నాడు రంగయ్య.

"నేను కూడా పట్నం వెళ్ళి ఐటీఐ లో చేరా బాబాయ్.ఏదన్నా కార్ఖానా లో పనికి కుదురు దాం అనుకున్నా. మా అమ్మా నాన్నా పెద్ద వారై పోయారు. నాకు తిరిగి రాక తప్పలేదు ఏం చేస్తాం.

మన ఊరికి, మాలాంటి యువ కులకు బాగు పడే యోగం లేదు." అన్నాడు రోశయ్య ...

ఇంతకీ కుళాయిలు ఎందుకు పనిచేయ డం లేదో ? చేదని బావి లోకి వదులుతూ ప్రశ్నిం చాడు రంగయ్య.

"కాంట్రాక్టర్ డబ్బుకు కక్కుర్తి పడి నాసిరకం మోటార్లు బిగిం చాడట బాబాయ్.. అవి మొన్న వర్షాకాలం పిడుగు పాటుకు కాలి పోయాయి" అంటూ చేద తాడు అందుకు న్నాడు రోశయ్య.

"పిడుపాటును తట్టుకునే పరికరాలు ఉంటాయట , కానీ డబ్బు ఆదా కోసం వాటిని కాంట్రాక్టర్ బిగించ లేదు.

అదే కాక జాయింట్లు పగిలి పైపులన్నీ మట్టితో కూరుకు పోయాయట.. కనుక ఇక కుళాయిల సంగతి మరిచి పో.. ప్రభుత్వము మంచి పని చేయాలన్నా ఇదిగో ఇలాటి కాంట్రాక్టర్ల వల్ల వాళ్ళకు చెడ్డపేరు! జనానికి తిప్పలు తప్ప దం లేదు" అన్నాడు రోశయ్య..

"రాజుల సొమ్ము రాళ్ళ పాలు! నేటి పాలన లో ప్రజల డబ్బు కాంట్రాక్టర్ల పాలు! మాకు రేపటి నుండి మళ్ళీ రెండు పూటలా చల్ల బువ్వనే" గొణుక్కుం టూ కడవ భుజాని కెత్తుకున్నాడు రంగయ్య.

.......

స్కూల్ నుండి ఇంటికి వస్తూ ఉంటే నెత్తిమీద నీళ్ల కడవ పెట్టుకుని కనిపించాడు సుబ్బా రావు.

"శ్రీనూ, నేను ఈరోజు నుండీ ట్యూషన్ కి రావడం లేదు" అను కుంటూ వెళ్ళిపోతున్న స్నేహి తునికేసి విచారంగా చూసాడు శ్రీను.



**- శ్రీనివాస శాస్త్రి**
9866898477

## కవిత్వం

రవి కిరణం సోకని ప్రదేశములో
కవి కలం అణువణువున చుంబించు
శబ్ద నిశ్శబ్ద సౌందర్యముతో
లయ, ధ్వని, రంగు, రుచి, వాసన సృష్టించు
దృశ్య శ్రవణంతో పండిత
పామరులలో చక్కిలిగింతలు పెట్టించు
మనిషి మనసులో రగిలిన భిన్న గుణగణాలు ఉపమానాలతో
విశ్వంభర కావ్యం మొలకెత్తించు
ప్రకృతి తో మమేకం ఉబికి వచ్చిన
భావోద్వేగం గజ్జె కట్టి ఆడిన వల్లంకి తాళం
సమాజములో కుళ్ళును
అక్షరాల ఆసిడ్ తో కడిగేసి
చరణం తో మరణాన్ని జయించిందే కవిత్వం
కన్నెలు ఈడు వచ్చిన ఇంద్రధనస్సుకు ఉపమానం.
కలువ వన్నెలు చంద్రుని వెన్నెలకు అలంకారం
కవిత కు మత్తు కళ్ళు ఆది ప్రాసలు
ఒంపు సొంపు నడకలే అంత్య ప్రాసలు
ఊహలు అజంతా ఎల్లోరా శిల్పాలు
పదాల సర్కస్ ఫీట్స్ చెరగని ముద్ర వేసే సొగసైన రూపాలు
ఆవేశాలు ,ఆక్రందనలు,
పాఠకుల గుండెల్లో రాకెట్ స్పీడ్ లో చీల్చుకుంటూ
పోయేదే విప్లవ కవిత్వం గొంతెత్తి పిలిచిన
మహా ప్రస్థానం మరో ప్రప్రపంచం.
చక్కర మాటల మూట ను
చిక్కని తేనెల ఊటను అలవోకగా పుట్టించవచ్చు .
విప్లవ జ్వాల రగిలించిమనిషిని మనిషిగా
అందముగా తీర్చి దిద్దవచ్చు.



**-పూసాల సత్యనారాయణ**
9000792400

### ప్రగతి రథ ఇంధనం

సంపన్నుడిగా ఉంటేనే..
అందరి దృష్టిని ఆకర్షిస్తాం
మేధో సంపద ఉంటే..
అందరి గౌరవం పొందుతాం
సరైన నైపుణ్యాలు ఉన్నపుడే..
పరిశ్రమ గుర్తింపునిస్తుంది !
పేదవాడిగా ఉంటే..
చులకనగా తీసి పడేస్తారు
అమాయకంగా ఉంటే..
అందరు నిన్ను వాడుకుంటారు
పొగరుగా ఉంటే..
ఎవ్వరూ పట్టించుకోరు !.
క్రమంగా ఎదగడమంటే..
నిన్నటి కన్న నేడు మెరుగుపడడం
అందరి మెప్పు పొందాలంటే..
పరహిత స్వచ్ఛంద కార్యాలు చేయడం
సమాజం ఈసడించుకోవాలంటే..
దురలవాట్లకు బానిస కావడం !.
మౌనంగా ఉంటే..
ఎవ్వరు అడగరు, ఏమీ చెప్పరు
ఆవేశ ఆక్రోశాలు చూపితే..
దగ్గరికి రావడం మానేస్తారు.
మొహమాటపడితే..
ఎవ్వరూ నీ వైపు చూడరు !.
బలంగా నిలబడితే..
అందరు నీ వెంట నడుస్తారు
బలహీనంగా ఉంటే..
తొక్కేసి ముందుకెళతారు
టఫ్‌గా ఉంటేనే..
నీకు విలువ దక్కుతుంది !.
నీ కుటుంబానికి నీవే..
మూల స్తంభం కావాలి
తల్లితండ్రులకు నువ్వు..
బాధ్యతగల సంతానం కావాలి
పిల్లలను సన్మార్గంలో పెంచే..
తల్లిదండ్రులు కావాలి !.
అందరూ నీ వైపు చూడాలంటే..
సృజనశీల సత్తా చూపాలి
అందరి మన్ననలు
పొందాలంటే..
ఆవిష్కర్తగా నీ సత్తా చాటాలి
జీవచ్ఛవంలా బతకాలంటే..
నిరుపయోగంగా నిద్ర పోవాలి !.
ప్రతి మనిషికి..
ఓ నిర్దిష్ట లక్ష్యం కావాలి
ప్రతి భాగస్వామికి..
భద్రత కల్పించే తోడు కావాలి
దేశ ప్రగతి రథానికి..
బాధ్యతగల
పౌర ఇంధనం కావాలి !



**-మధుపాళీ,**
9949700037



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

### స్తూపాల తొవ్వలో

తెలంగాణ సరిహద్దు తవ్వకుంటూ పోయాను
అడుగడుగునా ఒక అమరవీరుని సమాధి
నీ మరణానికి కారణం ఏమిటని అడిగాను..
సమాధి మాట్లాడలేదు
అక్కడి మట్టి గొంతు విప్పింది.
అరవై ఏళ్ళ అవమానాన్ని చెప్పింది..
బిగించిన పిడికిలిలోని కలలను చూపింది
రాలిన మొగ్గలను ఒడిలో పెట్టుకొని ఏడ్చింది.
ఆ సమాధి దగ్గర నిలబడి చూస్తుంటే
ఒక మనిషి మరణమే కనిపించలేదు.
ఒక జాతి గాయం
ఒక ప్రాంతం కన్నీరు
ఒక ఉద్యమ గర్జన వినిపించింది.
తెలంగాణ అంటే
పటంలో కనిపించే భూభాగం కాదు
త్యాగాలతో నిర్మించిన అస్తిత్వం.
ఈ మట్టిని తాకి చూడండి
ఇక్కడ గాలి కూడా
స్వాభిమానమే ఊపిరిగా పీలుస్తుంది..
ఈ నేల మాకు నేర్పింది ఒక్కటే
అన్యాయం ముందు మౌనంగా ఉండొద్దని

**-స్వప్న కొండమడుగు**
9640207126

### అక్క అంటే మరో అమ్మ

నన్ను ఎవరైనా కొట్టనికి తిట్టనికివస్తే
మా అక్క ముందుండి
నన్ను కాపాడుతుంది
మా అక్కది అమ్మప్రేమ.
మా అక్కలో నచ్చనిది కోపం
మా అక్కని ఎవరైనా తిడితే
నాకు కోపం వస్తుంది
నేను మా అక్క గొడవపడితే
కొట్టుకుంటాం తిట్టుకుంటాం,కానీ
ఆఖరికి కల్సుకుంటాం
మాది పాలునీళ్ల తత్వం.
మా అక్క నవ్వితే
వెన్నెల కురిసినట్టుగా ఉంటుంది
మా అక్క అంటే నాకు చాలాఇష్టం
నేను మా అక్క మాటలు
మళ్ళీ మళ్ళీ మాట్లాడితే
తనకి పట్టరానంత కోపంవస్తుంది
మా అక్కకు ఏమైనా అయితే
నేను పక్కన ఉండి చూసుకుంటాను
అక్క అంటే మరో అమ్మ కదా!

**- ప్రవళిక**

### నిజమైన ఆనందం

నా బిడ్డ ఏమో అనుకున్న కానీ
నాకు ఈరోజు నిజమైన ఆనందం
పరిచయం చేసింది
నా బిడ్డ చదువుల తల్లి
నా ఆశలను నెరవేర్చే కల్పవల్లి
పుత్రోత్సాహం కాకుండ
పుత్రికోత్సాహం కలిగించింది
నన్ను ఈ సమాజంలో
తలెత్తుకునేలా
నా బిడ్డ అని గర్వంగా
చెప్పుకునేలా చేసింది
ఆడ పిల్లల తల్లిదండ్రులకు
కొండంత భరోసానిచ్చింది
భగవంతుని ఆశీస్సులతో
ఉన్నత శిఖరాలను
అధిరోహించుగాక
అధిరోహించుగాక!!

**- పద్మ సత్యనారాయణ**

### ఆకలిలోతు.......

ఎత్తిపొడుపు మాటలతో
కత్తులెన్నో దూసినావు
కనిపించని మనసుకు
గాయాలెన్నో చేసినావు
మాన్పుకుందామంటే
దరిదాపు చేరని ఓదార్పు
మచ్చుకైన కనిపించవాయే
మానవత్వపు ఛాయలు
సంపద మార్పిడి కొరకు
పైసకే పట్టంగట్టి
ప్రదక్షణలు చేస్తుండు.
పుట్టుకనేమో మరుస్తుండు
మనిషి కాదమ్మో వీరు
మర మనుషులై ఏలుతుండ్రు
నిండినోడికి ఏమెరుక
కడుపు నిండినోడికేమెరుక
ఆకలిలోతు.........
సమస్యల తీరు
పాపం పుణ్యమిక్కడే
నరకం స్వర్గమిక్కడే..

**-యరకల యాదయ్య**
9866468979.

### నా అంతరంగ పరిచయం

శ్రమ నా తల్లి !
మేధస్సు నా తండ్రి !.
కలం నా బలం !
నా ఘన స్వరం మైకు !.
రాత్రి సైతం తీరికగా
నా సుదీర్ఘ ఆలోచన !
ఉదయం నా వర్తమానం !.
నా కృషి భవిష్యత్తు!
నా చూపుకు రాయిలోని శిల్పం సైతం
కనిపిస్తుంది-
కవితలో ఒదిగి శిల్పమౌతుంది !
నా చెవి కోకిలకు గూడు !
నా పాదాలు అన్ని స్థలాలా లోకేషన్ !

**-కందాళై రాఘవాచార్య**
8790593638

### ఆదివాసిని నేను

ఆది వాసిని నేను
అడివి ఊసును నేను
పచ్చని పల్లెటూరును
మాటలు రాని మూగనోరును
ఆదివాసిని నేను
అడివి ఊసును నేను
కొండగుట్టల్లోచేను చెలకల్లో
కండలను కరిగించి
చెమట కాల్వలు పారించి
పంటలే పండించి
భూమికే బువ్వ పెట్టే
గుణంగల గూడెంవాసిని
ఆదివాసిని నేను
మట్టిలాంటి మంచి మనసును
మబ్బులా కురిసే మమతను
ఇంపైన ఇప్పచెట్టును
మాట తప్పని మట్టిబిడ్డను
మడమ తిప్పని పులిబిడ్డను
గుట్ట నాకు చుట్టము
చెట్టు నా నేస్తము
నాగోబా జాతరను
కొత్త కోడల్ల భేటిని
అభివృద్ధి పేరిట
కాలుష్యం కాటేస్తుస్తూ
అడవి పొమ్మంటున్నగుండెను
అన్యంపుణ్యం ఎరుగని
మన్యం మనిషిని
ఆదివాసిని నేను
అడవి ఊసును నేను.

**-రమేశ్ నల్లగొండ**

### ఒక్కసారైనా

భానుడు వెదజల్లే అగ్గిమంటను,
నీ పాదాలకు తాకకుండా చూసిన
నీ పాదరక్షలు నీకై ఎదురుచూస్తున్నాయి.
సూర్యుడు రాకముందే లేచి
పుస్తక పఠనం చేసేటప్పుడు
నీ కంటికి సహాయపడ్డ అద్దాలు
నీకై ఎదురు చూస్తున్నాయి.
ఓ రథంలో ఓ రాజు వెళ్లినట్టు
నీ బండిపై ఎన్నో గ్రామాలకు వెళ్ళేవాడివి
ఇప్పుడు ఆ బండి నడిపేవారులేక
అది బాధగా ఓ మూలన పడుంది.
ఆకాశమంతా
చీకటి మబ్బులు కమ్మినట్టు
నువ్వులేక ఇల్లంతా చీకటి అలుముకుంది
నువ్వు ఇష్టంగా కట్టుకున్న ఇల్లు
నీకై ఎదురుచూస్తుంది కానీ
ఎదురు చూస్తున్న వస్తువులకేం తెలుసు
సూర్యుడు అస్తమించినట్టుగా
నీవు కూడా శివునిలో లీనమయ్యావని
అయినా వీలుచూసుకొని
ఒక్కసారైనా వచ్చిపో తాతా
ఒక్కసారైనా వచ్చిపో.

**-టి.విశాలాక్షి**

### గప్పుదు తెలుస్తదిలే

నువ్వుట్టినయాల్లప్పుడు
ఎంతో మురుసుకుంట ఎత్తుకొని ముద్దాడినం
కాని గిప్పుడు గా మురుపెం
మంటల్లో మండిపోతున్న కట్టైంది.
నువ్వు పెద్దగై మమ్మల్ని ఉద్దరిస్తవని ఊహించి
నీకు ఊహతెల్వని యాల్లనుంచి
బంగారుకొండ తీరుగ సూసుకున్నం కాని
మాకు గిప్పుడు అర్థమైంది
అది ఊహ మాత్రమేనని.
నువ్వు చిన్నప్పుడు ఏడ్చిన ప్రతీసారీ
మా గుండెల మీద ఆడించినం నవ్వించినం
గట్లనే నువ్వూ మా అంతయ్యి
మా గుండెల్ల పెరుగుతున్న
బాధల బండరాళ్ళనూ తొలగించి
సంతోషాన్ని పంచుతవనుకున్నం కాని
కన్నీటిని పరిచయం చేస్తవని
మేమెప్పుడూ కలగనలేదు.
రెండు పిట్టలు కష్టపడి
కట్టెపుల్ల కట్టెపుల్ల తెచ్చి గూడు కడితే
గుడ్డులోంచి పసి గుడ్డువచ్చి
గీ గూడు నాదని ఎల్లగొట్టిన పరిస్థితైంది మాది.
నీ జీవితంలో ఎదగనీకి
గిప్పుడు గీ ముడతవడ్డ చేతులే
సహాయవడ్డయని మరచిపోయినవా
గిప్పుడు నీకు భారంగున్నమా
ఐనా మేమేం చింతించం
ఎందుకంటే మీరూ ఏదో ఒక యాలకి
గీ పరిస్థితిని ఎదుర్కోవాల్సిందే కదా
గప్పుదు తెలుస్తదిలే

**- పద్మ భవ్యశ్రీ**

### ఆగని కాల గడియారం

గడియారాన్ని నీవు సృష్టించినా
కాలాన్ని నీవు సృష్టించలేవు!.
కాలాన్ని గడియారం ముల్లు లో
బంధించి కొలిచినా
బ్రతుకు గడియారంలో తిరుగుతూ
ఆగిపోయే జీవితం ముల్లువి!.
కాలానికి నీవు బంధీవీ!
గడియారంలో తిరిగే ముళ్ళు
ఉదయాస్తమానాలకు చెల్లు !.
కాలం వలయంగా తిరిగే త్రిపాది
భూత వర్తమాన భవిష్యత్‌ల పునాది!.
భూత వర్తమాన భవిష్యత్తు ల
కాలానికి మూడు కళ్ళు
వెనుకకు తిరగలేని
గడియారపు ముల్లు !.
కాలాన్ని ఆపి చూద్దామని
నీ గడియారాన్ని ఆపుకుంటే
కాలం ఆగుతుందా!.
కృష్ణ పరమాత్మ గ్రహణం తో
పొద్దుగూకేటట్లు చేసినా
ఆగలేదు కాల గడియారం!

**-పట్లోళ్ళబక్కారెడ్డి**
9705315250

